




# PRAJA PRASHNA ప్రజాప్రశ్న


తెలుగు దినపత్రిక






సంపుటి: 6 సంచిక: 25, పేజీలు - 08
RNI : TELTEL/2021/80267
సోమవారం, జులై 20, 2026 వెల: 5 రూ/.






# రూ.800 కోట్ల భూ దోపిడీకి..

# 'ఫ్రీడమ్' స్కెచ్!



- బండ్లగూడలో నకిలీ 'సమరయోధుడి' పేరిట 10 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాహా!
- ఆధారాలు కొండంత.. రెండేళ్లుగా చర్యలు శూన్యం!
- వ్యవస్థల మౌనం వెనుక సూత్రధారులెవరు?

**మహా కుట్ర** ▶ చనిపోకముందే విల్ డీడ్, డెత్ సర్టిఫికెట్లు ఫోర్జరీ! లేని ఇళ్లకు నకిలీ డోర్ నంబర్లు సృష్టించి భవన నిర్మాణ అనుమతులు!!

**బ్యాంకులకూ టోకరా** ▶ నకిలీ పత్రాలతో జాతీయ, ప్రైవేటు బ్యాంకుల నుంచి వందల కోట్ల రుణాలు! నట్టేట మునిగిన అమాయక కొనుగోలుదారులు!!

**ఫైళ్లలోనే దర్యాప్తు** ▶ 2022లో కోర్టు ఆదేశాలతో ఎఫ్ఐఆర్ నమోదైనా కదలని పోలీసులు! యథేచ్ఛగా సాగుతున్న "పల్లవి గార్డెనియా" అక్రమ నిర్మాణాలు!! వ్యవస్థలను మేసేసిన అవినీతి తిమింగలాలు!




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రభుత్వ భూమి కనిపిస్తే చాలు కాజేయడానికి అవినీతి పగటిదొంగలు ఎంతటి దారుణానికైనా తెగబడుతున్నారు! పవిత్రమైన 'స్వాతంత్ర సమరయోధుడు' అనే పేరును కూడా తమ దొంగ వ్యాపారానికి వాడుకుని, ఏకంగా రూ.800 కోట్ల ప్రభుత్వ ఆస్తిని నిలువునా దోచేశారు. ఉప్పల్ మండలం బండ్లగూడ పరిధిలోని సర్వే నంబర్ 36/5 లో సాగిన ఈ ల్యాండ్ స్కామ్ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది.రాచకొండ కనకయ్య అనే వ్యక్తిని ఫ్రీడమ్ ఫైటర్‌గా చిత్రీకరిస్తూ నకిలీ పట్టాలు, ఫోర్జరీ రెవెన్యూ రికార్డులు సృష్టించి, పక్కా ప్రణాళికతో 10 ఎకరాల సర్కారు భూమిని ప్రైవేటు వ్యక్తుల అకౌంట్లలోకి మార్చేశారు. తీరా రెవెన్యూ శాఖ విచారణ జరిపితే.. అతగాడు అసలు స్వాతంత్ర సమరయోధుడే కాదని, ప్రభుత్వ భూ కేటాయింపులే జరగలేదని తేలినా ఇంతవరకు అక్రమార్కులపై చర్యలు లేకపోవడం పాలకుల ఉదాసీనతకు పరాకాష్ట!

> **"ఇది ముమ్మాటికీ ప్రభుత్వ వ్యవస్థల వైఫల్యమే!**
> కీసర ఆర్డీఓ, ఉప్పల్ తహసీల్దార్ సమగ్ర సర్వే నివేదికలు, విజిలెన్స్ మెమోలు అన్నీ ఇది ప్రభుత్వ భూమేనని మొత్తుకుంటున్నా.. కబ్జాదారులపై చర్యలు తీసుకోకుండా ఎవరిని కాపాడుతున్నారు?"
> – పట్నం బాబా గౌడ్, సామాజిక కార్యకర్త

### కుంభకోణం మైలురాళ్లు.. అధికారిక నివేదికల వాస్తవాలు (2024-2026)

- నకిలీ ముసుగు : రాచకొండ కనకయ్య అసలు ఫ్రీడమ్ ఫైటరే కాదని తేల్చిన రెవెన్యూ శాఖ.
- రికార్డుల ఫోర్జరీ : కనకయ్య బ్రతికుండగానే విల్ డీడ్, మరణ ధ్రువీకరణ పత్రాలు సృష్టించారు.
- కంటితుడుపు దర్యాప్తు: 2022లో ఎల్‌బీనగర్ పీఎస్‌లో ఎఫ్ఐఆర్ (No.1821/2022) నమోదైనా నిందితులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు.

### చట్టం చచ్చిందా.? పలుకుబడికి మోకరిల్లిందా.?

ఒక సామాన్యుడు చిన్న గుడిసె వేసుకుంటే జేసీబీలతో కూల్చేసే అధికారులు.. వందల కోట్ల విలువైన 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి, పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్లు కడుతుంటే ఎందుకు కళ్లు మూసుకున్నారు? ఖాళీ స్థలంలో ఇళ్లు ఉన్నట్లు నకిలీ డోర్ నంబర్లు సృష్టించి, భవన అనుమతులు పొందినా మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఎందుకు కూర్చున్నారు?

ఈ నేరపూరిత కుట్ర వెనుక ఉన్న ఆ బడా రాజకీయ హస్తం ఎవరిది.?

### బాధితులారా.. అప్రమత్తం!

వివాదాస్పద బండ్లగూడ 36/5 సర్వే నంబర్ పరిధిలో, ముఖ్యంగా "పల్లవి గార్డెనియా" ప్రాజెక్టులో ప్లాట్లు, ఫ్లాట్లు కొనుగోలు చేసే ముందు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి.

నకిలీ పత్రాల మాయాజాలంలో చిక్కుకుని జీవితకాల సంపాదనను పోగొట్టుకోవద్దు. ఇప్పటికే మోసపోయిన బాధితులు తక్షణమే పోలీస్, విజిలెన్స్ అధికారులను ఆశ్రయించి న్యాయపోరాటం చేయాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## కూటమిలో జనసేన కుంపటి!

**– వైసీపీ ట్రాప్‌లో పడొద్దని టీడీపీ నేతలకు చంద్రబాబు కీలక ఆదేశాలు**



అమరావతి (ప్రశ్న న్యూస్) స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన పోటీపై ఏపీ మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన వ్యాఖ్యలు కూటమిలో అగ్గి రాజేస్తున్నాయి. ముఖ్యంగా ఉమ్మడి తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాల్లో జనసేన, టీడీపీ నేతల మధ్య సీట్ల పంచాయతీకి దారితీసే అవకాశం ఉంది. అయితే టీడీపీ క్యాడర్ స్పందించి ఎలాంటి ప్రకటనలు చేయకుండా పార్టీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు ముందుగానే

2లో..

## ఈటల - బండి కలిస్తే అధికారం వస్తుందా.?

**– రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ బీజేపీ నుంచి దూరంగా ఉన్నా ఆ పార్టీ గురించి మాత్రం ఎప్పుడూ వ్యాఖ్యలు చేస్తూ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ వార్తల్లో నిలుస్తున్నారు. ఈ క్రమంలోనే అంతర్గత విభేదాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి. వివాదాస్పద వ్యాఖ్యలతో ఇటీవల పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ తాజాగా పార్టీ నాయకత్వంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలపై స్పందించిన ఆయన కేవలం ఇద్దరు నేతలు కలిస్తే పార్టీ అధికారంలోకి వస్తుందా

2లో..

## భారీ నష్టానికి పోర్టును ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర

**– కూటమి ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**



అమరావతి (ప్రశ్న న్యూస్) రామాయపట్నం పోర్టు విషయంలో ప్రస్తుత టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర భవిష్యత్తుకు అత్యంత కీలకమైన రామాయపట్నం పోర్టును టీడీపీ పెద్దల జేబులు నింపేందుకు ఓ భారీ స్కామ్‌గా మార్చారని, రాష్ట్ర ఖజానాకు వేల కోట్ల రూపాయల నష్టం కలిగించేందుకు సిద్ధమయ్యారని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా

2లో..

## ఆగస్టు 3 వరకు గాంధీ భవన్‌కు రావొద్దు

**– నేతలకు రేవంత్ రెడ్డి కీలక సూచనలు**



- ఎస్ఐఆర్‌పై రేవంత్ కఠిన ఆదేశాలు
- ఆగస్టు 3 వరకు క్షేత్రస్థాయిలోనే ఉండాలని నేతలకు సూచన
- నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరిక
- ఉత్తమ 100 బీఎల్‌ఏలకు రాహుల్‌తో కలిపిస్తామని హామీ

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మిగతా పార్టీల పరిస్థితి ఎలా ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీలో విచిత్రమైన వాతావరణం ఉంటుంది. పార్టీ పదవులు రాలేదని కొందరు అసంతృప్తి చేస్తుంటే, మంత్రి పదవులు రాలేదని బహిరంగంగానే విమర్శలు చేసేంత స్వేచ్ఛ హస్తం పార్టీలో ఉంటుంది. ఓవైపు ప్రభుత్వాన్ని నడుపుతూనే, మరోవైపు పార్టీ బాధ్యతల్ని చూసుకోవాల్సిన బాధ్యత సీఎం రేవంత్ రెడ్డి నిర్వర్తిస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో నిర్వహించిన 'సర్' (ఎస్ఐఆర్ – స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) జూమ్ సమావేశంలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. పదవులు, నామినేటెడ్ ఛైర్మన్ పోస్టుల కోసం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌కు వచ్చే వారికి ఎలాంటి అపాయింట్‌మెంట్లు ఇవ్వవద్దని పార్టీ అగ్రనాయకత్వానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

2లో..

## పార్లమెంట్ సమావేశాలకు సర్వం సిద్ధం

**– 8 బిల్లులతో కేంద్రం రెడీ**

**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పార్లమెంటు వర్షాకాల సమావేశాలు నేటి నుంచి జరగనున్నాయి. ఆగస్టు 13 వరకు కొనసాగనున్న ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టేందుకు కేంద్రం 8 బిల్లులను సిద్ధం చేసింది. ముఖ్యంగా నేడే పార్లమెంట్ ముందుకు రెండు కీలక బిల్లులు రానున్నాయి. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య 33 నుంచి 37 కు పెంచుతూ రూపొందించిన బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టనుంది. వందేమాతరం గేయానికి జాతీయగీతం హోదా కల్పిస్తూ రూపొందించిన బిల్లును కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. ఈ క్రమంలోనే సమావేశాలు సజావుగా సాగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కేంద్రం కోరింది. మరోవైపు అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగం, నీట్ పేపర్ లీకేజీ సహా పలు కీలక అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని విపక్షాలు ప్రకటించాయి.

2లో..



# కూటమిలో జనసేన కుంపటి!

స్పందించి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

### టీడీపీ క్యాడర్‌కు చంద్రబాబు ఆదేశాలు..

రాబోయే ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిలోని ఏ పార్టీ ఎన్నెన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే అంశంపై టీడీపీ నాయకులెవరూ బహిరంగంగా మాట్లాడవద్దని పార్టీ అధినేతల చంద్రబాబు క్యాడర్‌ను ఆదేశించారు. పార్టీ ముఖ్య నేతలతో చంద్రబాబు శనివారం రాత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ, అనవసర చర్చలకు అవకాశం ఇచ్చేలా ఏ ఒక్కరూ వ్యవహరించవద్దని హెచ్చరించారు. కూటమి భాగస్వామ్య పార్టీలు టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య విభేదాలు సృష్టించడానికి గొడ్డలి పార్టీ వైసీపీ కాచుకుని కూర్చుందని, ఈ విషయాన్ని టీడీపీ నేతలు గుర్తుంచుకోవాలని సూచించారు.ఎన్నికల కార్యాచరణను మరింత బలోపేతం చేసేందుకు ఎంపీలు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నేతలతో వచ్చే నెల మొదటి లేదా రెండో వారంలో ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహిస్తామని చంద్రబాబు వెల్లడించారు. స్థానిక సంస్థల ఎన్నికల సీట్ల సర్దుబాటు గురించి టీడీపీ నేతలు చర్చించవద్దని, పోటీ చేసే స్థానాలపై ఎలాంటి ప్రకటనలు చేయవద్దని చంద్రబాబు స్పష్టం చేశారు. ఆ అంశాన్ని కూటమి పార్టీల అగ్రనాయకత్వం సరైన సమయంలో చర్చించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. పార్టీ నేతలు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధం చేయడంపైనే ఫోకస్ చేయాలని సూచించారు. కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేసి అద్భుత ఫలితాలు సాధించేలా ముందుకు సాగాలని పార్టీ శ్రేణులకు చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

### బలం ఉన్నచోట జనసేన పోటీ చేస్తుంది: మంత్రి నాదెండ్ల మనోహర్

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలపై జనసేన నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ ఇటీవల గుంటూరులో కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే ఎన్నికల్లో జనసేనకు బలం ఉన్న ప్రతి చోటా తాము తప్పకుండా పోటీ చేస్తామని స్పష్టం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్ర ప్రయోజనాల కోసం, వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనే ఉద్దేశంతో అధినేత పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు జనసైనికులు వెనక్కి తగ్గారని గుర్తుచేశారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి లేదని, క్షేత్రస్థాయిలో బలాబలాలు చూసుకుని సర్పంచ్ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పోటీకి జన సైనికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.
ఆనాటి సార్వత్రిక ఎన్నికల ఫార్ములా స్థానిక ఎన్నికలకు వర్తించదని, ఈసారి సీట్ల విషయంలో తగ్గే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. పార్టీ కోసం మొదటి నుండి కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు పోటీ చేసేందుకు జనసేనలో తగిన ప్రాధాన్యత, అవకాశాలు కల్పిస్తామన్నారు. కూటమిలోని మిత్రపక్షాలతో తగిన సమన్వయం చేసుకుంటూనే, జనసేన శ్రేణులంతా ఎన్నికలకు సంపూర్ణంగా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ ప్రకటనతో కూటమిలో సీట్ల సర్దుబాటుపై రాజకీయ వర్గాల్లో చర్చ మొదలైంది.

## ఈటల - బండి కలిస్తే అధికారం వస్తుందా.?

అంటూ బీజేపీ అధిష్ఠానాన్ని ప్రశ్నించారు. ఇటీవల పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ సమక్షంలో ఎంపీ ఈటల రాజేందర్, కేంద్రమంత్రి బండి సంజయ్ మధ్య సమన్వయం కుదిరిన నేపథ్యంలో రాజాసింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈటల, బండి సంజయ్ కలిసి పని చేయడం మంచి పరిణామమే అయినప్పటికీ వాళ్ళు రాజీపడితే తెలంగాణలో రాజ్యం వచ్చేస్తోందా? అని ప్రశ్నించారు. పార్టీలో సీనియర్ నాయకులు, బూత్ స్థాయి కార్యకర్తల పరిస్థితి ఏమిటో కూడా నాయకత్వం ఆలోచించాలని సూచించారు.త్వరలో జరగనున్న గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కార్పొరేషన్ ఎన్నికలపై కూడా రాజాసింగ్ తనదైన శైలిలో స్పందించారు. 3 కార్పొరేషన్లలో మేయర్ పదవులు గెలుస్తామని నేతలు చెబుతున్నారని ముందు ఒక కార్పొరేషన్‌లో అయినా సగం కార్పొరేటర్ స్థానాలు గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలం ఎంత ఉందో వాస్తవంగా అంచనా వేసుకోవాలని అతివిశ్వాసంతో ప్రకటనలు చేయడం వల్ల కార్యకర్తల్లో అయోమయం పెరుగుతుందని వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పరిస్థితిపైనా రాజాసింగ్ స్పందించారు. అధ్యక్షుడి చేతులు కట్టేసి పని చేయమంటే ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. పార్టీలో కొద్దిమంది నేతల వ్యక్తిగత ఈగోలు, అంతర్గత విభేదాలు పార్టీకి తీవ్ర నష్టం చేస్తున్నాయని.. ఈ విషయాన్ని ఢిల్లీ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. బీజేపీ అధికారంలోకి రావాలంటే కేవలం అగ్రనేతల మధ్య రాజీ సరిపోదని బూత్ స్థాయి కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వాలని రాజాసింగ్ స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడుతున్న కేడర్‌ను పట్టించుకోకుండా ఒక్క వ్యక్తి చుట్టూ నిర్ణయాలు తీసుకోవడం సరికాదని హితవు పలికారు. రాజాసింగ్ చేసిన ఈ వ్యాఖ్యలు తెలంగాణ బీజేపీలో మరోసారి అంతర్గత చర్చకు దారితీయగా రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల నేపథ్యంలో కమలం పార్టీలో రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## భారీ నష్టానికి పోర్టును ప్రైవేటుకు కట్టబెట్టే కుట్ర

ఒక పోస్ట్ చేస్తూ ప్రభుత్వంపై ఘాటు విమర్శలు గుప్పించారు.

### మా హయాంలో పురోగతి... ఇప్పుడు ప్రైవేటుపరం

నవ్యాంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధికి పోర్టులే కీలకమని భావించిన తమ ప్రభుత్వం, రామాయపట్నం, మచిలీపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణంలో గణనీయమైన పురోగతి సాధించిందని జగన్ గుర్తుచేశారు. ఈ మూడు పోర్టులకు సంబంధించి భూసేకరణ, అన్ని రకాల చట్టబద్ధమైన అనుమతులు, ఆర్థిక వనరుల సమీకరణ వంటి అత్యంత క్లిష్టమైన పనులన్నీ తమ హయాంలోనే పూర్తయ్యాయని ఆయన వివరించారు. ప్రాజెక్టుల పూర్తి కోసం ఈపీసీ కాంట్రాక్టులను కూడా ఖరారు చేసి, 2024 జూన్ నాటికి నిర్మాణ పనుల్లో చెప్పుకోదగ్గ పురోగతిని సాధించామని తెలిపారు. ఇంత కష్టపడి ఒక రూపు తీసుకొచ్చిన పోర్టును ఇప్పుడు టీడీపీ ప్రభుత్వం అప్పనంగా ప్రైవేటుపరం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆయన ఆరోపించారు.

### పోర్టుతో ముడిపడిన భారీ ప్రాజెక్టులు

రామాయపట్నం పోర్టు వల్ల రాష్ట్రానికి అపారమైన ఆర్థిక ప్రయోజనాలు చేకూరనున్నాయని జగన్ తన పోస్టులో ప్రస్తావించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బీపీసీఎల్) సుమారు రూ.1 లక్ష కోట్లకు పైగా పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న గ్రీన్‌ఫీల్డ్ రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్ పూర్తిగా రామాయపట్నం పోర్టుపైనే ఆధారపడి ఉందని తెలిపారు. ముడి చమురు దిగుమతికి ఈ పోర్టు కీలకం కానుందన్నారు. అలాగే, ఇండోసోల్ సోలార్ సంస్థ ఏర్పాటు చేయనున్న గిగా స్కేల్ తయారీ ప్లాంటుకు కూడా ఈ పోర్టే ఆధారం అని తెలిపారు. ముడిసరుకుల దిగుమతికి, తయారైన సోలార్ మాడ్యూళ్ల ఎగుమతికి ఈ డీప్ వాటర్ పోర్టు అత్యంత అవసరమని పేర్కొన్నారు.వీటితో పాటు, వైఎస్సార్ కడప జిల్లాలో జేఎస్‌డబ్ల్యూ స్టీల్ నిర్మిస్తున్న ఉక్కు కర్మాగారానికి అవసరమైన ముడి ఇనుము, కోకింగ్ కోల్ వంటివి దిగుమతి చేసుకోవడానికి రామాయపట్నం పోర్టులో ఆ సంస్థ రెండు బెర్తులను అభివృద్ధి చేస్తోందని గుర్తుచేశారు. ఈ ప్రాజెక్టులన్నీ వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించడమే కాకుండా, రాష్ట్రానికి పన్నుల రూపంలో భారీ ఆదాయాన్ని సమకూరుస్తాయని జగన్ వివరించారు.

### రూ.3,500 కోట్ల నష్టానికి అమ్మకం

ఇన్ని ఆర్థిక ప్రయోజనాలున్న రామాయపట్నం పోర్టును టీడీపీ ప్రభుత్వం ఓ భారీ స్కామ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తోందని జగన్ తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.4,929 కోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్న ఈ పోర్టును, కేవలం రూ.1,500 కోట్ల ముందస్తు చెల్లింపులకే ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలని చూస్తోందని ఆయన విమర్శించారు. దీనివల్ల రాష్ట్ర ఖజానాకు తీరని నష్టం వాటిల్లుతుందని, మిగిలిన రూ.3,500 కోట్లకు పైగా అప్పుల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే మోయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పెద్దలకు నగదు ప్రవాహాలు సృష్టించడమే ఈ కుట్ర వెనుక ఉన్న అసలు లక్ష్యమని ఆయన ధ్వజమెత్తారు.

# ఆగస్టు 3 వరకు గాంధీ భవన్‌కు రావొద్దు

### హైదరాబాద్ చుట్టూ తిరగడంపై రేవంత్ అసహనం

కొందరు నేతలు నియోజకవర్గాల్లో కాకుండా హైదరాబాద్‌లోనే ఉంటూ క్షేత్రస్థాయిలో పనిచేయకపోవడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రేపటి నుంచి ఆగస్టు 3 వరకు నేతలెవరూ పార్టీ ఆఫీసు అయిన గాంధీభవన్‌కు రావొద్దని, ఈ లోపు ఇన్‌ఛార్జి మంత్రులు అన్ని జిల్లాల్లో దీనిపై సమీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

### సర్ ప్రక్రియపై బీఎల్‌ఏ రిపోర్టులపై ఆధారపడకూడదు.. సొంతంగా వర్క్ చేయాలి

రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇప్పటివరకు 489 భేటీలు జరిగాయని, ముఖ్యంగా వెనుకబడిన నియోజకవర్గాల్లోని నేతలు ఇప్పటికైనా చురుగ్గా స్పందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. ఎంపీలు పార్లమెంట్ సమావేశాల్లో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి సమీక్షలు నిరంతరం జరపాలని, ఇన్‌ఛార్జిలుగా ఉన్న చోట బాధ్యతగా పనిచేయని వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. బూత్ లెవెల్ ఆఫీసర్ల నివేదికలపై ఆధార పడటం కంటే పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల రిపోర్టులను పరిశీలించాలని, కేవలం అధికారుల నివేదికలపైనే ఆధారపడితే చర్యలు ఉంటాయన్నారు.కాంగ్రెస్ నేతలు రాబోయే 10 రోజులు ఎన్నికల ప్రచారం తరహాలో నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటించాలి. పదవులు, పోస్టులు అంటూ హైదరాబాద్ చుట్టూ తిరిగితే కుదరదు. జులై 30న ఎస్ఐఆర్ పై మళ్లీ పూర్తిస్థాయి సమీక్ష నిర్వహిస్తాం. టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మరింత బాధ్యత తీసుకుని ఈ ప్రక్రియను సమన్వయం చేయాలి. ఆగస్టు 3 వరకు సర్ ప్రక్రియ మీద ఫోకస్ చేయాలి, కానీ గాంధీ భవన్ వైపు మాత్రం పైరవీల కోసం ఎవరూ రావొద్దు. ఈ కార్యక్రమంలో అత్యుత్తమంగా పనిచేసే 100 మంది బీఎల్‌ఏలను కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో కలిపిస్తామని, ఆయనతో ఫొటో దిగే ఛాన్స్ ఇస్తామని' సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు.

## పార్లమెంట్ సమావేశాలకు సర్వం సిద్ధం

ఈ మేరకు కేంద్రం నిర్వహించిన అఖిలపక్ష భేటీలో తమ వైఖరిని స్పష్టం చేశాయి. దీంతో పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వాడీవేడీగా సాగనున్నాయి.

### రాజ్నాథ్ అధ్యక్షతన అఖిల పక్ష సమావేశం

అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో రక్షణ మంత్రి రాజ్ నాథ్ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా సహా 40 రాజకీయ పార్టీలకు చెందిన 58 మంది నాయకులు హాజరయ్యారు. ఈ భేటీలో అయోధ్య రామమందిరం విరాళాల దుర్వినియోగం, నీట్ పేపర్ లీక్, పెట్రోల్‌లో ఈ20 ఇంధన మిశ్రమం వంటి అంశాలపై పార్లమెంట్‌లో చర్చ జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. మణిపుర్‌లో పరిస్థితులపైనా చర్చించాలని కోరినట్లు కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్ తెలిపారు. సోనమ్ వాంగ్‌చుక్ చేస్తోన్న నిరసనపై కూడా చర్చ జరగాలని సమాజ్‌వాదీ పార్టీ డిమాండ్ చేసింది. మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాల బలంతోనే అమలు చేయాలని డీఎంకే కోరింది.
అటు పార్లమెంట్ ఎంత బాగా పనిచేస్తే దేశానికి అంత ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని అఖిలపక్ష భేటీలో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు పేర్కొన్నారు. ఉభయ సభల్లో విపక్షాల అభిప్రాయాలను వింటామని స్పష్టం చేశారు. విపక్షాలు కూడా తమ వాదనలను వింటారని ఆశిస్తున్నామని కిరణ్ రిజిజు ఆశాభావం వ్యక్తం చేశారు. సానుకూల చర్చల తర్వాత ప్రభుత్వం తీసుకొచ్చే బిల్లులకు అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఎనిమిది బిల్లుల జాబితా మాత్రమే ఉందని తెలిపారు. అదనంగా మరే బిల్లును ప్రవేశపెట్టాల్సి వచ్చినా ముందుగా బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ)లో చర్చించి, ప్రతిపక్షాలకు సమాచారం ఇచ్చిన తర్వాతే ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. జీరో అవర్, ప్రత్యేక ప్రస్తావనలు వంటి అంశాలు సాధారణ పార్లమెంటరీ ప్రక్రియలో భాగమేనని, ప్రతి సభ్యుడికి వాటిపై మాట్లాడే హక్కు ఉంటుందని చెప్పారు.

## భవిష్యత్ పరిణామాలకు మీదే బాధ్యత

**- కాంగ్రెస్ ప్రభుత్వానికి హరీష్ హెచ్చరిక**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) బీఆర్ఎస్ నేత మాజీ మంత్రి హరీష్ రావు కీలక వ్యాఖ్యలు చేసారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ వద్ద మోటార్లు ఆన్ చేసి రైతన్నకు సాగు నీరు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. రాజకీయం కోసం లక్షలాది మంది రైతుల ఉసురు పోసుకోవద్దంటూ ప్రభుత్వానికి హితవు పలికారు. నీళ్లు లేకుంటే విద్యుత్ ఉత్పత్తి ఆగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఏర్పడే తీవ్ర పరిణామాలకు నీదే బాధ్యత అంటూ ముఖ్యమంత్రి రేవంత్ ని హరీష్ హెచ్చరించారు. మాజీ మంత్రి హరీష్ సీఎం రేవంత్ లక్ష్యంగా ఆసక్తి కర వ్యాఖ్యలు చేసారు. ప్రతి చుక్కని పట్టిసీమ ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒడిసి పడుతుందని గుర్తు చేశారు. రైతులకు నీళ్లు ఇవ్వమంటే బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను తిడుతున్నారని కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డారు. గోదావరి జలాలు వచ్చినవి వచ్చినట్లు కిందకి వదులుతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రాజకీయాల కోసం రాష్ట్ర భవిష్యత్తును పణంగా పెడుతున్నారంటూ సీఎం రేవంత్‌పై ఆగ్రహం వ్యక్తం చేసారు. కేసీఆర్‌ను తిడితే నీళ్లు రావని మోటార్లు ఆన్ చేస్తే నీళ్లు వస్తాయని వ్యాఖ్యానించారు. భద్రాచలం కొట్టుకుపోతుందంటూ సీఎం రేవంత్ చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అర్థరహితమని అన్నారు.

### రైతులకు నీళ్లు వదిలే వరకూ పోరాటం చేస్తాం

రైతుల కంటే తనకు ఏదీ ముఖ్యం కాదని హరీష్ చెప్పుకొచ్చారు. తనను కావాలంటే కోయాలని రైతులకు మాత్రం నీళ్లు వదలాలని కోరారు. రేవంత్ నీళ్లు ఇవ్వడం ఇష్టం లేక ఆయన అలా మాట్లాడుతున్నారని చెప్పారు. భేషజాలకు పోవద్దంటూ సీఎం రేవంత్ రెడ్డికి సూచించారు. అన్ని రిజర్వాయర్లు నింపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 60 శాతం తెలంగాణకు సాగు నీరు ఇచ్చే అవకాశం ఉందని వివరించారు. రైతులకు నీళ్లు ఇచ్చే దాక ప్రభుత్వాన్ని వదిలిపెట్టమని మాజీ మంత్రి హరీశ్ రావు హెచ్చరించారు. చిన్నకోడూరు మండలం అన్నపూర్ణ రిజర్వాయర్ (అల్లీపూర్) వద్ద నుంచి రంగనాయకసాగర్ వరకు రైతుల పాదయాత్ర కొనసాగుతోంది. 16 కిలో మీటర్ల మహాపాదయాత్రలో వేలాది మంది రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

# పాలలో నిద్రమాత్రలు కలిపిచ్చి, పాముతో కరిపించి..

## ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసిన భార్య



ఉత్తరప్రదేశ్ లోని మీరట్ జిల్లా లో దారుణమైన హత్యోదంతం వెలుగులోకి వచ్చింది. వివాహేతర సంబంధానికి అడ్డు తొలగించుకోవడానికి, భర్త పేరుమీద రూ.20 లక్షల బీమా సొమ్ము కాజేయడానికి ఓ భార్య ప్రియుడితో కలిసి పక్కా ప్లాన్ వేసి భర్తను మర్డర్ చేసింది. అంతేగాక ఈ మరణాన్ని సహజమైన పాముకాటు గా చిత్రీకరించేందుకు కుట్ర చేసింది. కానీ పోలీసులు ఆ కుట్రను ఛేధించారు. నిందితులైన మృతుడి భార్యను, ఆమె ప్రియుడిని అరెస్ట్ చేశారు.పోలీసుల కథనం ప్రకారం.. హస్తినాపూర్‌లో నివసించే అతుల్ పన్వార్, అతని భార్య దామిని కలిసి ఒక ప్లే స్కూల్ నడుపుతున్నారు. ఈ క్రమంలో దామినికి ఆ స్కూల్ వ్యాన్ డ్రైవర్ తుషార్‌తో వివాహేతర సంబంధం ఏర్పడింది. భర్తను వదిలించుకోవడానికి వీరు మొదట రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి చంపాలని చూశారు. కానీ ఆ ప్లాన్ ఫెయిల్ కావడంతో మరో భయంకరమైన ప్లాన్ వేశారు.
గత గురువారం రాత్రి దామిని తన భర్త తాగే పాలలో నిద్రమాత్రలు కలిపి ఇచ్చింది. అతుల్ స్పృహ కోల్పోయిన తర్వాత తుషార్ సాయంతో ఒక విషసర్పాన్ని తెచ్చి బెడ్‌పైకి వదిలి కరిపించారు. శుక్రవారం ఉదయం అతుల్ అపస్మారక స్థితిలో పడి ఉండటంతో ఆసుపత్రికి తరలించగా అతడు అప్పటికే చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. తొలుత ఇది సాధారణ పాముకాటు మరణంగా భావించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు కొన్ని అనుమానాలు వచ్చాయి. దాంతో రూరల్ ఎస్పీ అభిజీత్ కుమార్ నేతృత్వంలో రంగంలోకి దిగిన పోలీసులు.. దామిని, తుషార్‌ల మొబైల్ ఫోన్ రికార్డులను, లొకేషన్ డేటాను నిశితంగా పరిశీలించారు.వారిద్దరి మధ్య ఉన్న సంబంధం, హత్య జరిగిన రాత్రి వారి కదలికలు బయటపడ్డాయి. పోలీసుల విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించారు. నిందితుడైన తుషార్‌కు ఇదివరకే పెళ్లయిందని, తన భార్యకు విడాకులు ఇచ్చి దామినితో కలిసి ఉండటానికే ఈ హత్యకు పాల్పడినట్లు తేలింది.

## అమ్మాయితో వచ్చి, ఫ్రెష్ అవ్వడానికి రూం ఇవ్వాలని బెదిరింపులు..


### తిరుపతిలో నకిలీ పోలీస్ హల్‌చల్




తిరుపతి జిల్లాలో నకిలీ పోలీసు వ్యవహారం సంచలనం రేపింది. అర్ధరాత్రి వేళ ఓ హోం స్టే వద్దకు అమ్మాయితో వచ్చిన ఓ వ్యక్తి.. రూం కావాలని బెదిరింపులకు దిగాడు. ఫ్రెష్ అప్ అయ్యి వస్తానని అమ్మాయితో గదిలోకి వెళ్లి మూడు గంటలైనా రాకపోవడంతో అనుమానం వచ్చి హోం స్టే నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం ఈ వెలుగులోకి వచ్చింది.వివరాల్లోకి వెళ్తే.. శనివారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో పోలీస్ యూనిఫామ్ ధరించి ఓ వ్యక్తి తిరుపతి అలిపిరిలోని విహా హోం స్టే వద్దకు వచ్చాడు. ఓ అమ్మాయితో వచ్చిన అతను కానిస్టేబుల్ అని చెప్పి రూం కావాలని అడిగాడు. ఫ్రెష్ అప్ అయ్యి కొద్దిసేపట్లోనే వస్తామని, రూం ఇవ్వాలని సిబ్బందిని బెదిరించాడు. దీంతో భయపడిన హోం స్టే నిర్వాహకులు అతనికి గదిని ఇచ్చారు.
అయితే శనివారం తెల్లవారుజామున 3 గంటలకు అమ్మాయితో కలిసి గదిలోకి వెళ్లిన వ్యక్తి.. ఉదయం 6 గంటలు అవుతున్నా గది తలుపులు తీయకపోవడంతో హోం స్టే నిర్వాహకులను అనుమానం వచ్చింది. వెంటనే మేనేజర్ స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అలిపిరి పోలీసులు హోం స్టే వద్దకు చేరుకుని సదరు వ్యక్తిని విచారించారు. అయితే సదరు వ్యక్తి అసలు పోలీస్ కాదని.. కానిస్టేబుల్ యూనిఫామ్ వేసుకుని తిరుగుతున్నాడని పోలీసుల విచారణలో తేలింది. ఆ నకిలీ పోలీసు పేరు దాసరి కార్తీక్ అని.. అతను గుంటూరు జిల్లాకు చెందినవాడిగా గుర్తించారు.

## ఇంట్లో కొత్తగా ఏం చేయాలని ఆలోచిస్తున్నారా.?

### ఈ గ్రీన్ చికెన్ కర్రీ బెస్ట్..




చాలామంది ఇంట్లో కొత్త వంటకం ఏదైన ట్రై చేయాలి అనుకొంటారు. అయితే ఏం చెయ్యాలో తెలియక ఆలోచనలో పడతారు. అలంటివారు ఇంట్లో గ్రీన్ చికెన్ కర్రీ ట్రై చేయండి. ఏది ఎంతో రుచికరంగా ఉంటుంది. అందరికి నచ్చుతుంది. మరి ఈ గ్రీన్ చికెన్ కర్రీ ఇంట్లో తయారుచేసుకోవడం ఎలా.? చికెన్, కొత్తమీర గుప్పెడ, వెల్లుల్లి, పచ్చిమిర్చి, పుదీనా, ఉల్లిపాయ, జీడిపప్పు, మిరియాల పొడి, పసుపు, పెరుగు, గరం మసాలా, నూనె గ్రీన్ చికెన్ తయారీకి కావాల్సిన పదార్థాలు. ముందుగా షాప్ నుంచి తెచ్చుకొని ఉంచుకోవాలి.ముందుగా మీరు షాప్ నుంచి తెచ్చుకున్న చికెన్‌ను మంచి నీటితో శుభ్రంగా శుభ్రంగా కడుక్కొని పక్కన పెట్టుకోవాలి.
కొత్తిమీర, తొక్క తీసిన వెల్లుల్లి రెబ్బలు, పచ్చిమిర్చి , పుదీనా, ఫ్రై చేసిన ఉల్లి ముక్కలు, జీడిపప్పును వేసి పేస్టులా గ్రైండ్ చేసుకోవాలి. తర్వాత ఒక బౌల్‌లో కడిగిన చికెన్‌కు ఉప్పు, నల్ల మిరియాల పొడి, పసుపు,పెరుగు, గ్రైండ్ చేసిన గ్రీన్ పేస్టును వేసి బాగా కలుపుకోవాలి. ఒక ప్యాన్‌లో నూనె తీసుకొని స్టౌవ్‌పై వేడి అయిన తర్వాత రెడీగా ఉంచుకున్న చికెన్ మొత్తం వేసి బాగా కలపాలి. తర్వాత మూత ప్యాన్‌పై పెట్టి మీడియం ఫ్లేమ్‌లో మధ్య మధ్యలో కలుపుతూ 15 నిమిసాలు పాటు స్టౌవ్‌పై ఉడికించాలి. 15 నిమిషాల తర్వాత అందులో గరం మసాలా వేసుకోని ముక్క ఉడికిందో లేదో చూసుకొని అవసరం మేరకు ఉప్పును కలుపుకోవాలి. మళ్లీ కాసేపు సిమ్‌లో ఉడికించుకోవాలి. అంతే.. టేస్టీ టేస్టీ గ్రీన్ చికెన్ కర్రీ రడీ అయినట్లే. ఈ కర్రీ రైస్, చపాతీ, పరోటాతో రుచిగా ఉంటుంది. ఇది మీ ప్రియమైనవారికి, పిల్లలకి, కుటుంబ సభ్యులకు కచ్చితంగా నచ్చుతుంది. ఒక్కసారి ట్రై చెయ్యండి.

# జాతీయ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల కలకలం

### - ట్రైనీ ఐపీఎస్ అధికారిపై కేసు నమోదు..

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** దేశంలోని అత్యున్నత పోలీసు శిక్షణా సంస్థగా పేరొందిన హైదరాబాద్‌లోని సర్దార్ వల్లభభాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీలో లైంగిక వేధింపుల ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి. తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ అధికారిణిని లైంగికంగా వేధించాడనే ఆరోపణలపై ట్రైనీ ఐపీఎస్ అధికారి ఉదయ్ కృష్ణారెడ్డిపై అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులకు బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం నిందితుడు కొంతకాలంగా తనకు అసభ్యకరమైన సందేశాలు పంపుతూ మానసికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని పేర్కొన్నారు.తన అనుమతి లేకుండా తన పర్సనల్ వీడియోలు చిత్రీకరించి వాటితో బెదిరింపులకు పాల్పడినట్లు కూడా ఆమె ఆరోపించారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం ఈనెల 9వ తేదీన నిందితుడు తనను బలవంతంగా గదిలోకి లాక్కెళ్లినట్లు పేర్కొన్నారు. ఆ తర్వాత మెడపై కత్తి పెట్టి బెదిరించాడని బాధితురాలు తెలిపింది. ఆ తర్వాత తన ప్రైవేట్ వీడియోలు రికార్డు చేసి, సెల్ ఫోన్‌ను తీసుకుని ఆ వీడియోలను తన భర్తకు వాట్సాప్ ద్వారా పంపించాడని ఆరోపించింది. ఈ ఘటనతో తాను తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని ఆమె పేర్కొన్నారు.బాధితురాలి ఫిర్యాదు ఆధారంగా అత్తాపూర్ పోలీసులు రంగంలోకి దిగారు. ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్లతో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్ 66(సీ) కింద కేసు నమోదు చేశారు. నిందితుడి వాంగ్మూలాన్ని నమోదు చేసి కేసుకు సంబంధించిన డిజిటల్ ఆధారాలను సేకరించే ప్రక్రియను పోలీసులు ప్రారంభించారు. ఈ ఘటనపై నేషనల్ పోలీస్ అకాడమీ వర్గాలు ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. అయితే దేశంలో అత్యున్నత స్థాయి పోలీసు అధికారులకు శిక్షణ ఇచ్చే ఇలాంటి సంస్థలోనే ఈ ఆరోపణలు




వెలుగులోకి రావడం పోలీసు వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఫిర్యాదులో చేసిన ఆరోపణలపై విచారణ పూర్తయ్యే వరకు అవి ఆరోపణలుగానే పరిగణించాల్సి ఉంటుంది. దర్యాప్తులో లభించే ఆధారాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

# వెయిట్ లాస్ అవ్వాలంటే

## ఈ మిల్క్‌షేక్ ట్రై చేయండి..

జిమ్‌కు వెళ్లే వారు, వెయిట్ లాస్ టార్గెట్ ఉన్నవారికి ఈ హెల్తీ మిల్క్‌షేక్ చాలా ఉపయోగంగా ఉంటుంది. షుగర్ లేకుండా నేచురల్ ఇంగ్రిడియంట్స్‌తో తయారయ్యే ఈ షేక్ బాడీకి ఎనర్జీని ఇస్తుంది. ఆకలిని నియంత్రిస్తుంది. మార్నింగ్ బ్రేక్ ఫాస్ట్ లో తీసుకుంటే ఫ్యాట్ బర్న్, ఫిట్‌నెస్ మెయింటైన్ చేయడంలో సహాయపడుతుంది. జిమ్‌కు వెళ్లే వారికి, వెయిట్ లాస్ అవ్వాలనుకునే వారికి ఈ స్పెషల్ మిల్క్‌షేక్ చాలా హెల్ప్ చేస్తుంది. ఇది బాడీకి ఎనర్జీని ఇచ్చి, హెల్దీగా ఉంచుతుంది. ఈ మిల్క్‌షేక్‌లో నాచురల్ ఇంగ్రిడియంట్స్ మాత్రమే యూజ్ చేస్తారు. ఇందులో షుగర్ యాడ్ చేయాల్సిన అవసరం లేదు. మార్నింగ్ ఈ షేక్ తాగితే బాడీకి రోజంతా ఎనర్జీ ఉంటుంది.

మిల్క్ షేక్ తయారీకి కావాల్సిన పదార్థాలు

అరటిపండ్లు – 1 (మీడియం సైజు)

నానబెట్టిన డేట్స్ – 3 నుంచి 4

గుమ్మడి గింజలు – 1 టీస్పూన్

నానబెట్టిన బాదం – 4 నుంచి 5

పచ్చి పాలు – 1 గ్లాస్ (సుమారు 200 నుంచి 250ఎంఎల్)

తయారీ విధానం: మిక్సీ జార్‌లో ముందుగా అరటిపండు, నానబెట్టిన ఖర్జూరాలు, పాలు వేసి మెత్తగా బ్లెండ్ చేయండి. ఆ తరువాత గుమ్మడి గింజలు కలపాలి.. వీటిని పొడి రూపంలో వేసుకున్నా మంచిదే. గుమ్మడి గింజలు శరీరంలోని చెడు కొవ్వును తగ్గించడంలో సహాయపడతాయి. చివరగా నానబెట్టిన బాదంను కూడా కలిపి బ్లెండ్ చేస్తే మిల్క్‌షేక్ మరింత రుచికరంగా, శక్తివంతంగా మారుతుంది. ఈ మిల్క్‌షేక్‌ను మార్నింగ్ బ్రేక్‌ఫాస్ట్‌గా తీసుకోవచ్చు.. కొద్దిగా సలాడ్ లేదా లో కార్బ్ ఫుడ్‌తో పాటు తీసుకోవచ్చు. ఇది మధ్యాహ్నం వరకూ ఆకలి వేయకుండా చేస్తుంది. బాదంలో ఉండే హెల్తీ ఫ్యాట్స్ బాడీని స్ట్రాంగ్ గా ఉంచుతాయి. డయాబెటిస్



ఉన్నవారు ఈ మిల్క్‌షేక్‌ను తీసుకోకూడదు. ఎందుకంటే బనానాలో నాచురల్ షుగర్ ఎక్కువగా ఉంటుంది. ఇది బ్లడ్‌లో గ్లూకోజ్ లెవెల్స్‌ను పెంచే ఛాన్స్ ఉంది.

# స్నానం చేసే నీటితో చిటికెడు పసుపు కలిపారంటే !

చాలా మంది ప్రతిరోజూ స్నానం చేసే నీటిలో చిటికెడు పసుపు కలిపి స్నానం చేస్తుంటారు. పసుపు కలిపిన నీటితో స్నానం చేయడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. జ్యోతిష్య శాస్త్రంలో పసుపుకు చాలా ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా స్నానం నీటిలో పసుపుతో స్నానం చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఇది మీ జీవితంలోని అనేక సమస్యలను తొలగిస్తుంది. చాలా మంది ప్రతిరోజూ స్నానం చేసే నీటిలో చిటికెడు పసుపు కలిపి స్నానం చేస్తుంటారు. పసుపు కలిపిన నీటితో స్నానం చేయడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి. జ్యోతిష్య శాస్త్రంలో పసుపుకు చాలా ప్రాముఖ్యత ఉంది. ముఖ్యంగా స్నానం నీటిలో పసుపుతో స్నానం చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఇది మీ జీవితంలోని అనేక సమస్యలను తొలగిస్తుంది. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం పసుపు శరీరం నుంచి ప్రతికూల శక్తిని తొలగించి, శుద్ధి చేసే లక్షణాలను కలిగి ఉంటుంది. స్నానం నీటిలో పసుపును జోడించడం వల్ల



అదృష్టం వెంటాడుతుంది. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం.. పసుపు బృహస్పతి గ్రహంతో ముడిపడి ఉంది. పసుపుతో స్నానం చేయడం వల్ల జాతకంలో బృహస్పతి గ్రహం మారడం ప్రారంభమవుతుంది.

అంతేకాకుండా ఎంతో కాలంగా వివాహం జరగక పెళ్లి గడియల కోసం ఎదురు చూస్తున్నవారు.. బకెట్ నీటిలో చిటికెడు పసుపు కలిపి ప్రతిరోజూ స్నానం చేయాలి. ఇలా పసుపు నీటితో స్నానం చేయడం వల్ల త్వరగా వివాహం జరుగుతుందని నమ్మకం. బకెట్ నీటిలో ఒక టీస్పూన్ పసుపు వేసి బాగా కలిసి స్నానం చేస్తే, అనేక ఆరోగ్య సమస్యల నుంచి బయటపడటానికి కూడా సహాయపడుతుంది. పసుపులోని యాంటి బయోటిక్ లక్షణాలు వర్షాకాలంలో అంటువ్యాధులు రాకుండా నిరోధిస్తుంది.

# మహిళలకు ఎక్కువగా

## ఎందుకు జుట్టు రాలిపోతుంది?



మహిళల్లో మోనోపాజ్ ప్రక్రియ 45 నుంచి 55 సంవత్సరాల మధ్య జరుగుతుంది. ఈ సమయంలో, స్త్రీ శరీరం అనేక మార్పులకు లోనవుతుంది. అలసట, జుట్టు రాలడం, ఋతుస్రావం సమయంలో అధిక రక్తస్రావం, ప్రతి నెలా పీరియడ్స్ రాకపోవడం, మానసిక చిరాకు, మానసిక స్థితిలో.. ప్రతి మహిళ జీవితంలో ఎదురయ్యే సహజ ప్రక్రియ. ఈ సహజ ప్రక్రియ 45 నుంచి 55 సంవత్సరాల మధ్య జరుగుతుంది. ఈ సమయంలో, స్త్రీ శరీరం అనేక మార్పులకు లోనవుతుంది. అలసట, జుట్టు రాలడం, ఋతుస్రావం సమయంలో అధిక రక్తస్రావం, ప్రతి నెలా పీరియడ్స్ రాకపోవడం, మానసిక చిరాకు, మానసిక స్థితిలో మార్పులు వంటి లక్షణాలు కనిపిస్తాయి. ముఖ్యంగా చాలా మంది మహిళలు ఈ సమయంలో జుట్టు రాలడం సమస్యను ఎదుర్కొంటారు. ఇది హార్మోన్ల మార్పుల వల్ల సహజం. కానీ మహిళలు దీనివల్ల ఎక్కువగా ఆందోళన చెందుతారు. మోనోపాజ్ సమయంలో జుట్టు రాలడాన్ని ఎలా నివారించాలి? అనే సందేహానికి నిపుణులు ఇక్కడ కొన్ని చిట్కాలు చెబుతున్నారు. మెనోపాజ్ సమయంలో ఈస్ట్రోజెన్ స్థాయిలు తగ్గినప్పుడు, ఇది జుట్టు ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. ఫలితంగా జుట్టు పెరుగుదల మందగిస్తుంది. జుట్టు రాలడం, సన్నబడటం వంటి మరిన్ని సమస్యలకు దారితీస్తుంది. జుట్టు రాలడాన్ని నివారించడానికి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచడం చాలా ముఖ్యం. ఇది చర్మ స్థితిస్థాపకత, జుట్టు పెరుగుదల, ఆర్ద్రీకరణను పెంచుతుంది. ఇది అధిక జుట్టు రాలడాన్ని నివారిస్తుంది. జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల కూడా చర్మం, జుట్టు ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఇది తల చర్మం పొడిబారడాన్ని తగ్గిస్తుంది. కాబట్టి మీరు మాంసాహారులైతే, చేపలు ఎక్కువగా తినడం మంచిది. జుట్టు, చర్మం, గోళ్ల ఆరోగ్యానికి విటమిన్ బీ7 చాలా అవసరం. దీనిని బయోటిన్ అని కూడా అంటారు. ఈ విటమిన్ బీ7 కెరాటిన్ ఉత్పత్తిని ప్రేరేపిస్తుంది. జుట్టు మెరుపును పెంచుతుంది.

# జామ ఆకు టీతో

## ఆ సమస్యలకు చెక్..



చాలా మంది ఉదయం లేవగానే టీ, కాఫీ, గ్రీన్ టీ వంటివి ఎక్కువగా తాగుతుంటారు. కానీ ఆరోగ్యానికి మేలు చేసే జామాకు టీ గురించి ఎక్కువగా తెలియదు. దీనిని ప్రతి రోజూ తాగడం వలన అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు. అందరికీ జామకాయ గురించే తెలుసు. కానీ జామ కాయలే కాదండోయ్ జామ ఆకులతో అద్భుతమైన టీని కూడా తయారు చేసుకోవచ్చునంట. జామ ఆకుల టీలో యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్ఫ్లమెంటరీ సమ్మేళనాలు , పోషకాలు ఎక్కువగా ఉంటాయి. అంతే కాకుండా క్వెర్సెటిన్ వంటి ఫ్లేవనాయిడ్స్ కూడా సమృద్ధిగా ఉంటాయి. అందువలన ఇది చర్మానికి, ఆరోగ్యానికి చాలా మంచిదంట. జామ ఆకుల టీలో బయోయాక్టివ్ రసాయన సమ్మేళనాలు ఉండటం వలన ఇది మానవ శరీరంలోని జీవక్రియను మెరుగు పరుస్తాయి. అంతే కాకుండా ఇందులో ఉండే, ఫ్లేవనాయిడ్లు, ట్రైటెర్పెనాయిడ్లు, సెస్క్విటెర్పెనెస్, గ్లైకోసైడ్లు, ఆల్కలాయిడ్స్, సాపోనిన్లు , ఇతర ఫినోలిక్ సమ్మేళనాలు వంటివి కడుపు సమస్యల నుంచి ఉపశమనం కలిగించడమే కాకుండా, మధుమేహం, క్యాన్సర్, హృదయ సంబంధ వ్యాధుల నుంచి కాపాడుతుంది. జపాన్‌లో దీనిని ఎక్కువగా తీసకుంటారు. డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉన్నవారు , రక్తంలోని చక్కెర స్థాయిలను తగ్గించుకోవడానికి ప్రతి రోజూ భోజనం తర్వాత జామాకు టీ తీసుకుంటారు. ఎందుకంటే ఇందులో కార్బోహైడ్రేట్స్, పాలీఫినాల్స్ ఉంటాయి. అందువలన ఇది రక్తంలోని చక్కెర స్థాయిలు పెరగకుండా నియంత్రిస్తుంది. అసలు ఈ జామకు టీ ఎలా తయారు చేసుకోవాలో ఇప్పుడు చూద్దాం..4-5 జామ ఆకులను బాగా కడిగి, మురికిని తొలగించండి. ఒక సాస్పాన్‌లో 2 కప్పుల నీటిని వేడి చేసి, మరిగించి, ఆ ఆకులను జోడించండి. వాటిని 10-12 నిమిషాలు తక్కువ వేడి మీద మరిగించండి. మంటను ఆపివేసి, మూతపెట్టి, టీని మరో 5 నిమిషాలు నానబెట్టండి. ఒక కప్పులో వడకట్టండి. కావాలనుకుంటే తేనె లేదా నిమ్మకాయ వేసి, వెచ్చగా తినండి. ఇందులో విటమిన్ ఎ , యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉంటాయి. ఇది కంటి ఆరోగ్యానికి చాలా మంచిది. అయితే కొంత మందిలో వయసు పెరిగే కొద్దీ, అస్పష్టమైన దృష్టి వంటి సమస్యలు తలెత్తుతాయి. అలాంటి వారు ప్రతి రోజూ ఈ టీ తాగడం చాలా మంచిదంట. అంతే కాకుండా ఇది తల తిరగడం, కంటి అలసట, వణుకు వంటి సమస్యలను, రక్తంలోని చక్కెర స్థాయిలను నివారించడానికి ఉపయోగపడుతుందంట.

# బిడ్డను కన్నయ్యలా

## ఇలా రెడీ చేయండి!




శ్రీ కృష్ణ జన్మాష్టమి వచ్చేస్తుంది. ఈ రోజు తల్లిదండ్రులందరూ తమ కుమారుడు లేదా కుమార్తెను చిన్ని కన్నయ్యలా, గోపికల్లా అలంకరించి, తమ బిడ్డలోనే చిన్న కృష్ణుడిని చూసుకొని మురిసిపోతుంటారు. అయితే 2025వ సంవత్సరంలో జన్మాష్టమిని ఆగస్టు 15, 16న జరుపుకోనున్నారు. రాఖీ పండుగ అయిపోయిన తర్వాత అందరి దృష్టి శ్రీ కృష్ణ జన్మాష్టమి పైనే ఉంటుంది. ఇప్పటి నుంచే ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు మంచి మంచి శ్రీ కృష్ణుడి డ్రెస్సింగ్ స్టైల్ కోసం నెట్టింట తెగ సెర్చ్ చేస్తుంటారు. ఎందుకంటే? ఈ రోజున పెద్ద ఎత్తున శ్రీ కృష్ణుడి పుట్టిన రోజులు జరపడమే కాకుండా, దేవాలయాలు, ఇళ్లల్లో, పాఠశాల్లో చిన్న కన్నయ్యలతో సందడి వాతావరణం నెలకొంటుంది. చిన్న పిల్లలను శ్రీ కృష్ణుడిలా తయారు చేసి ఉట్టి కొట్టడం, గోపికలతో ఆటలు ఆడించడం లాంటివి చేస్తుంటారు. అయితే మనం చిన్నారుల కోసం అదమైన చిన్ని కన్నయ్య డ్రెస్సింగ్ స్టైల్స్ చూద్దాం పదండి.

శ్రీ కృష్ణ జన్మాష్టమి నాడు మీ బిడ్డను అందంగా కృష్ణుడిలా అలంకరించుకోవాలా.. దాని కోసం సింపుల్‌గా ఉన్న పసుపు రంగు కుర్తా, దానిపై చిన్న కృష్ణుడి చిత్రం , నెమలి కిరీటం, ఫ్లూట్, ముత్యాల హారం, వంటివి చాలా బాగుంటాయి. అదే విధంగా నొదుటన అందమైన బొట్టు పెట్టడం వలన మంచి కల వస్తుంది. అందంగా కనిపిస్తారు. మీ పిల్లలను పాఠశాలలో అందరికంటే అందమైన కృష్ణుడిలా తయారు చేయాలి అనుకుంటున్నారా? అందుకోసం క్లాసిక్ పసుపు ధోతి, నెమలి కిరీటం, ముత్యాల హారము, మెడ చుట్టూ చిన్న పూసల దండ, తలపై తేలికపాటి కిరీటం, చేతిలో ఫ్లూట్, నడుము కట్టు అలాగే నోటిపై కొద్దిగా వెన్నె రాస్తే చాలు చాలా అందంగా కనిపిస్తారు. జన్మాష్టమి రోజున మీ పిల్లలు కన్నయ్యలా అందంగా కనిపించడానికి తెలుపు రంగు ధోతి మంచి ఎంపిక, తెలుపు రంగు ధోతికి చిన్న అంచు ఉంటే మీ పిల్లలు చాలా అందంగా , అచ్చం చిన్న కన్నయ్యలా కనిపిస్తారు. అంతే కాకుండా స్టైలిష్ పూసల దండలు, కుర్తా సెట్, నెత్తిపై చిన్న నెమలీక చాలా బాగుంటుంది. శ్రీ కృష్ణ జన్మాష్టమి రోజున మీ పిల్లలు రంగురంగుల ముద్రిత హరే రామ్, హరే కృష్ణ కుర్తా సెట్లను కూడా ధరించవచ్చు. ఇవి చాలా సౌకర్యవంతంగా ఉంటాయి. అంతే కాకుండా మీ పిల్లల లుక్‌ను మార్చేస్తాయి. వీటితో పాటు మీరు దండ, గాజులు, నడుము పట్టీని కూడా జోడించవచ్చు.

# ఉదయాన్నే 3-5 గంటల

## మధ్య మెలకువ వస్తుందా?



చాలా మంది బ్రహ్మ ముహూర్త సమయంలో తెల్లవారుజామున 3-4 గంటలకు మేల్కొంటారు. ప్రతి రోజూ అదే సమయంలో ఎవరో నిద్రలేపినట్లు అకస్మాత్తుగా మెలకువ వస్తుంది. ఇలా మీకు జరుగుతుంటే, జ్యోతిషశాస్త్రంలో దీనికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఇది ప్రకృతి నుంచి వచ్చిన అతి పెద్ద సంకేతం. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం.. బ్రహ్మ ముహూర్తం అనేక విధాలుగా ప్రత్యేకమైనది. సూర్యోదయానికి దాదాపు గంటన్నర ముందు సమయాన్ని బ్రహ్మ ముహూర్తం అంటారు. కొన్నిసార్లు అలారం మోగకపోయినా కొంతమంది బ్రహ్మ ముహూర్తంలో మేల్కొంటారు. సరిగ్గా అదే సమయానికి కొంతమంది అకస్మాత్తుగా మేల్కొంటారు. ఇలా మీరూ తెల్లవారుజామున మూడు నుంచి నాలుగు గంటల మధ్య మేల్కొంటే, భయపడాల్సిన అవసరం లేదు. ఇది మీకు శుభ సంకేతమే. జ్యోతిషశాస్త్రం ప్రకారం.. ఈ విధమైన పరిణామం చాలా శుభప్రదంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే అనేక శుభశక్తులు ఉదయం మూడు నుంచి నాలుగు గంటల మధ్య తిరుగుతాయట. తెల్లవారుజామున 3 నుంచి 4 గంటల మధ్య మేల్కొంటే ప్రకృతి నుంచి మీకు ఏదో ఊహించని సంకేతం అందుతుండవచ్చు. అయితే మీరు ఈ సమయంలో మేల్కొంటే ఆ సమయాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలని, అప్పుడే అది మంచి ఫలితాలను ఇస్తుందని నిపుణులు అంటున్నారు. మీరు తెల్లవారుజామున మూడు నుంచి నాలుగు గంటల మధ్య మేల్కొంటే మీ ఇష్ట దైవాన్ని ప్రార్థించాలి. ఇలా చేస్తే రోజంతా పాజిటివ్ మైండ్ సెట్‌తో కొత్త ఎనర్జీతో నిండి ఉంటారు. అలాగే, అనేక సానుకూల విషయాలు మీ జీవితంలో జరుగుతాయి.

# మాట నిలబెట్టుకున్న పవన్


## గిరిజన గ్రామాలకు కోటి రూపాయల అభివృద్ధి పనులు. మూడు అంగన్వాడీ కేంద్రాల నిర్మాణం పూర్తి



అనంతగిరి(ప్రశ్న న్యూస్) గిరిజనులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలంలోని బల్లగరువు, వెలగపాడు, కొరపర్తి గ్రామాల్లో దాదాపు రూ.కోటి విలువైన అభివృద్ధి పనులు పూర్తి చేయించారు. గతంలో గ్రామాల పర్యటన సందర్భంగా గిరిపుత్రుల సమస్యలను స్వయంగా తెలుసుకున్న ఆయన, అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఇచ్చిన మాటను కార్యరూపంలోకి తీసుకొచ్చారు.గిరిజన ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని మూడు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారు. బల్లగరువు, వెలగపాడు గ్రామాల్లో సరైన భవనాలు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించిన పవన్ కళ్యాణ్, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) నిధులతో శాశ్వత భవనాలు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. దీంతో రూ.55 లక్షల వ్యయంతో మూడు నూతన అంగన్వాడీ భవనాలు నిర్మాణం పూర్తయ్యాయి.బల్లగరువు, వెలగపాడు గ్రామాల్లో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో ఆధునిక అంగన్వాడీ భవనాలు నిర్మించగా, కొరపర్తి గ్రామంలో గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ విభాగం సహకారంతో అంగన్వాడీ కేంద్రానికి ప్రహరీ గోడ నిర్మించారు. అదనంగా ఎంపీపీ




పాఠశాల భవనాన్ని పునరుద్ధరించి, తాగునీటి కోసం బోరు ఏర్పాటు చేయడంతో పాటు పైపులైన్ ద్వారా నీటి సరఫరా సౌకర్యాన్ని కల్పించారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం కూడా పూర్తి చేశారు.పవన్ కళ్యాణ్ గతంలో గ్రామాల పర్యటన సందర్భంగా గిరిజన కుటుంబాలతో కలిసి వారి ఇళ్లకు వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నారుల విద్య, ఆరోగ్యం, తాగునీటి కొరత, రహదారుల సమస్యలను స్వయంగా పరిశీలించారు. అప్పుడే అధికారులకు తక్షణ చర్యలు




తీసుకోవాలని సూచించి, అవసరమైన నిధులు సమకూర్చేలా చర్యలు చేపట్టారు.గ్రామాల్లో పనులు పూర్తికావడంతో గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చిన్నారులకు సురక్షితమైన అంగన్వాడీ భవనాలు, గ్రామాలకు తాగునీటి సదుపాయం, మెరుగైన రహదారులు అందుబాటులోకి రావడంతో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, మారుమూల గ్రామాలకు కూడా మౌలిక వసతులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. గిరిపుత్రులకు ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ అభివృద్ధి ఫలాలు ప్రతి గిరిజన గ్రామానికి చేరేలా కృషి కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు.

## మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే తలసాని



మారేడ్‌పల్లి : పండగలు మన సంస్కృతి, సాంప్రదాయాలను భావితరాలకు చాటిచెప్పే గొప్ప సంప్రదాయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివా స్‌యాదవ్ అన్నారు. ఆదివారం మోండా డివిజన్ ఆదయ్యనగర్ లోని 18 టెంపుల్స్‌లో బోనాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహంకాళి అమ్మవారు, నల్లపోచమ్మ అమ్మవార్లను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, పోతురాజుల విన్యాసాలు, భక్తుల కోలాహలంతో ఆయన పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను శాలువాతో సత్కరించారు. ప్రజలకు బోనాల శుభాకాంక్షలు తెలయజేస్తూ...అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని ఎమ్మెల్యే తలసాని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తలసాని స్కైలాబ్ యాదవ్, ఆలయ నిర్వాహకులు ఏకాంబరం, సాయిబాబా, చంద్రశేఖర్, జ్ఞానేశ్వర్, రాములు, భాస్కర్, రాజు, నాయకులు శ్రీకాంత్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## అర్ధరాత్రి వేళ ఇంట్లోకి చొరబడి.. మహిళల జుట్టు కత్తిరిస్తున్న ఆగంతకుడు



పాట్నా: ఒక ఆగంతకుడు అర్ధరాత్రి వేళ ఇళ్లలోకి చొరబడుతున్నాడు. నిద్రిస్తున్న మహిళల జుట్టు కత్తిరిస్తున్నాడు. వరుసగా రెండు సంఘటనలు జరుగడంతో ఆ గ్రామస్తులు భయందోళన చెందుతున్నారు. (intruder cut womenµs hair) బీహార్‌లోని దర్భంగా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూలై 16న దర్వార్ గ్రామంలో రాత్రివేళ నల్లటి దుస్తులు ధరించిన వ్యక్తి ఒక ఇంట్లోకి ప్రవేశించాడు. నిద్రిస్తున్న ఒక మహిళ జుట్టు కత్తిరించాడు. అలికిడికి ఆమె మేల్కోగా ఆ వ్యక్తి చీకటిలో మాయమయ్యాడు.కాగా, నేలపై కత్తిరించిన జుట్టు, కత్తెర ఉండటంతో పాటు ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండటం చూసి ఆ మహిళ షాక్ అయ్యింది. తన కుటుంబ సభ్యులకు ఈ విషయం చెప్పింది. నల్లదుస్తులు ధరించిన ఆ వ్యక్తి చేతిలో ఒక సంచి ఉన్నట్లు ఆ మహిళ తెలిపింది. తనకు మగతగా అనిపించిందని, అపస్మారక స్థితిలోకి నెట్టడానికి ఏదో పదార్థాన్ని అతడు ఉపయోగించినట్లు ఆమె ఆరోపించింది.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ ఇంటికి చేరుకున్నారు. ఫోరెన్సిక్ నిపుణులు, డాగ్ స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. రాత్రివేళ ఇళ్లల్లో నిద్రిస్తున్న మహిళల జుట్టు కత్తిరిస్తున్న ఆగంతకుడ్ని పట్టుకుని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.అయితే వారం కిందట కూడా గురువారం రోజునే మరో ఇంట్లో ఇలాంటి సంఘటన జరిగింది. వారం రోజుల్లో రెండుసార్లు ఆ వ్యక్తి ఇళ్లల్లోకి చొరబడి మహిళల జుట్టు కత్తిరించడంతో ఆ గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. ఇది తెలుసుకున్న స్థానిక మంత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

## ఒక్కసారిగా విరిగిపడ్డ కొండచరియలు.. చిన్నారులు సహా ఎనిమిది మంది దుర్మరణం..!

ఎడతెరపిలేని వర్షాలు నాగాలాండ్ రాష్ట్రాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఈ ఉదయం కురిసిన కుండపోత వర్షానికి ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడ్డాయి. పలు నివాసాలు కొండచరియల కింద నలిగిపోయాయి. ఈ ఘటనలో చిన్నారులు సహా ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురు కొండచరియల కింద చిక్కుకున్నారు. సమాచారం అందుకున్న రెస్క్యూ టీమ్స్ ఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టాయి. కొండచరియలు విరిగిపడిన ప్రాంతంలో ఇంకా వరదలు వస్తుండటంతో సహాయక చర్యలకు అంతరాయం ఏర్పడుతోంది. పోలీసులు, ఆర్మీ సిబ్బంది, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ, జాతీయ విపత్తు నిర్వహణ సంస్థకు చెందిన సిబ్బంది ఈ సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈ ఘటనపై నాగాలాండ్ ప్రభుత్వం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేసింది. ఘటనా ప్రాంతంలో దగ్గరుండి సహాయక చర్యలను పర్యవేక్షించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

## మున్నూరు కాపుల అభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలి

### - రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తం రావు పటేల్

మంచిర్యాల అర్బన్ : రాజకీయాలకు అతీతంగా మున్నూరు కాపు సామాజిక వర్గం అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేయాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సర్దార్ పుట్టం పురుషోత్తం రావు పటేల్ పిలుపునిచ్చారు. ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని నార్త్ఇన్ హోటల్లో నిర్వహించిన మున్నూరు కాపు సంక్షేమ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మున్నూరు కాపుల జనాభా గణనీయంగా ఉన్నప్పటికీ, వారికి తగిన రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలు మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మున్నూరు కాపు కార్పొరేషన్ ద్వారా విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలని కోరారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఐక్యంగా పనిచేయాలని, పార్టీలు, వ్యక్తిగత విభేదాలకు అతీతంగా సమాజ అభివృద్ధినే ప్రధాన లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు.రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జనగణన సర్వే లో మున్నూరు కాపుల సంఖ్యను తక్కువ చూపెట్టారని రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా, పట్టణ, గ్రామ స్థాయిలో ప్రత్యేక సర్వే నిర్వహించి మున్నూరు కాపుల సంఖ్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి పటేల్ మాట్లాడుతూ ప్రతి జిల్లాలో మున్నూరు కాపుల కోసం ఆత్మగౌరవ భవనాలు నిర్మించాలని, హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయి భవనం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో మంచిర్యాల మేయర్ ధరణి మధుకర్, రాష్ట్ర కార్యదర్శి, ఆసిఫాబాద్ జిల్లా ఇన్‌చార్జి గాదె సత్యం, జిల్లా ఇన్‌చార్జి ఇందురి తిరుపతి, జిల్లా అధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబులపు శ్రీనివాస్, నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ తూముల నరేష్, కరీంనగర్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సొత్తు మల్లేశ్, రాష్ట్ర కార్యనిర్వహక తదితరులు పాల్గొన్నారు.

## ఇంట్లోని గదిలో విద్యార్థి మృతి.. మూడు రోజుల తర్వాత మృతదేహం గుర్తింపు

బెంగళూరు: ఒక పారామెడికల్ విద్యార్థి తన ఇంట్లోని గదిలో అనుమానాస్పదంగా మరణించాడు. మూడు రోజుల తర్వాత ఆ గది నుంచి దుర్వాసన రావడాన్ని స్థానికులు గమనించారు. సీలింగ్‌కు వేలాడుతున్న యువకుడి మృతదేహాన్ని చూసి వారు షాక్ అయ్యారు. ఆ వ్యక్తి తండ్రితో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కర్ణాటక రాజధాని బెంగళూరులో ఈ సంఘటన జరిగింది. మారప్పనపాళ్యకు చెందిన20 ఏళ్ల ఉదయ్ గౌడ పారామెడికల్ కోర్సు చదువుతున్నాడు. కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో ఒక గదిలో అనుమానాస్పదంగా మరణించాడు.కాగా, ఆ ఇంటి నుంచి దుర్వాసన రావడాన్ని స్థానికులు గుర్తించారు. ఉదయ్ కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. ఆ గదిని తెరిచి చూడగా ఉరికి వేలాడుతూ అతడి మృతదేహం కనిపించింది. మృతదేహం కుళ్ళిన స్థితిలో ఉండటంతో మూడు రోజుల కిందట మరణించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేశారు. దర్యాప్తు కోసం ఉదయ్ మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు తన కుమారుడు ప్రతిరోజూ ఉదయం 7 గంటలకు కాలేజీకి వెళ్ళి రాత్రి 11 గంటలకల్లా ఇంటికి తిరిగి వచ్చేవాడని ఉదయ్ తండ్రి తెలిపారు. అయితే అనారోగ్య సమస్యల కారణంగా తాను నాలుగు రోజులుగా ఇంటికి దూరంగా ఉన్నట్లు ఆయన చెప్పారు. ఆ సమయంలో ఈ సంఘటన జరిగిందని తెలిపారు. ఉదయ్ ఇటీవల తిరుపతికి వెళ్లి వచ్చినట్లు వివరించారు. తన కుమారుడి ఆత్మహత్యకు కారణం ఏమిటన్నది తమకు తెలియని ఆయన అన్నారు.

## ముల్కల్లలో ఘనంగా గంగాదేవి బోనాల జాతర



హాజీపూర్ : మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 16 వ వార్డు ముల్కల్లలో ఆదివారం గంగాదేవి బోనాల జాతర భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. గ్రామ మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు మోసుకుంటూ ఊరేగింపులో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు వాయిద్యాలు, భక్తి గీతాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. చిన్నారులు, యువత, మహిళలు ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ ఊరేగింపును మరింత ఆకర్షణీయంగా మార్చారు. గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, యువకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేశారు.అమ్మవారి కృపతో గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలు ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## కేసీఆర్ నన్ను హగ్ చేసుకున్నరు.. నా లైఫ్‌లో జరిగిన అద్భుతం అదే

### - కార్టూనిస్ట్ శంకర్

కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డు-2026 ప్రదానోత్సవ సభ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేసీఆర్‌పై వేసిన కార్టూన్ గురించి కార్టూనిస్ట్ శంకర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కార్టూనిస్ట్ శంకర్ మాట్లాడుతూ.. 2005లో నా ఎగ్జిబిషన్ ప్రోగ్రాం పెట్టాం. ఆ కార్యక్రమానికి కేసీఆర్, చిరంజీవి వచ్చారు.. అప్పుడు కేసీఆర్ కర్లీగా ఒత్తుగా రింగు రింగుల జుట్టు ఉంటుండే. కార్టూనిస్టులు సాధారణంగా ఐడెంటిపికేషన్ కోసం ఓ క్యారెక్టర్‌ను డిజైన్ చేసుకుంటరు. కేసీఆర్ నెత్తిలో తెలంగాణ మ్యాప్ బాగా కుదిరింది. ఆ ఎగ్జిబిషన్‌ను చిరంజీవి ప్రారంభించిండు. మెగా షోకు మెగాస్టార్ అని హెడ్‌లైన్స్‌లో వస్తే.. కేసీఆర్ అది చూసి ఆ అబ్బాయిని లంచ్ పిలుద్దామన్నారు. అసలు ఓ పొలిటికల్ లీడర్ ఏమన్నా ఉంటే నా మీద ఇట్లా వేసిండని కేసు పెడ్తరు. లంచ్‌కు పిలవడం నాకు చాలా విచిత్రంగా అనిపించింది. పిలిచినా రూమ్‌లో వేసి ఏమన్నా చేస్తరా..? ఫీచర్స్ కుదిరినయా.. లేవా..? నా వెర్షన్‌లో ఇలా అనుకోని వేసిన వాళ్లకు ఎట్లుందో ఫ్యామిలీ పరంగా బయటినుంచి చూస్తే ఎట్లుందో.. అనిపించింది. ఒక మధ్యవర్తి వచ్చిండు..నన్ను లంచ్‌కు తీసుకొని పోయిండు. తిన్న తర్వాత ఆయన నెత్తిన వేలు పెట్టి ఏమో అంటుండు ఏంది అని చిరంజీవి నన్ను అడిగారు. నెత్తిల తెలంగాణ ఎందుకేసినవ్ అని చిరంజీవి నన్ను అంటే.. నువ్వేం చెప్పినవ్ అని కేసీఆర్ అడిగారు. 'తల తాకట్టు పెట్టైనా తెలంగాణ తెస్తా' అంటే కేసీఆర్ నన్ను హగ్ చేసుకున్నరు. బహుశా నా లైఫ్‌లో ఒక అద్భుతం జరిగిందంటే అదేనేమో అని చెప్పుకొచ్చారు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.

## హాస్టల్ మెస్‌లోకి ప్రవేశించిన మొసలి..

జైపూర్: ఒక హాస్టల్ మెస్‌లోకి మొసలి ప్రవేశించింది. అక్కడ ఉన్న సిబ్బంది దానిని చూసి షాక్ అయ్యారు. భయంతో పరుగులు తీశారు. హాస్టల్‌లో నివసించే యువకులు ఆ మొసలిని బంధించేందుకు ప్రయత్నించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. రాజస్థాన్‌లోని కోటా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. జూలై 17న మధ్యాహ్న సమయంలో కోరల్ పార్క్‌లో ఉన్న ఒక బాలుర హాస్టల్‌లోకి మొసలి ప్రవేశించింది. అది నేరుగా కిచెన్‌లోకి వచ్చింది.కాగా, కిచెన్‌లో పని చేస్తున్న సిబ్బంది చిన్న మొసలిని చూసి ఒక్కసారిగా షాకయ్యారు. భయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు. మొసలి సమాచారం తెలిసి హాస్టల్‌లోని కొందరు కోచింగ్ విద్యార్థులు కూడా బయటకు పరుగెత్తారు. కొందరు యువకులు దానిని నిలువరించి బంధించేందుకు ప్రయత్నించారు.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ సిబ్బంది ఆ హాస్టల్‌కు చేరుకున్నారు. డైనింగ్ రూమ్‌లోకి ప్రవేశించిన దానిని సురక్షితంగా పట్టుకున్నారు. ఆ తర్వాత సమీపంలోని నదిలో ఆ చిన్న మొసలిని విడిచిపెట్టారు. సమీపంలోని పెద్ద మురుగు కాలువ ద్వారా హాస్టల్ ప్రాంగణంలోకి అది ప్రవేశించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఆ హాస్టల్‌లోని సీసీటీవీలో రికార్డైన ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీకి భారీ ఊరట.. ఎంపీ ఆఫీసు కూల్చకుండా హైకోర్టు ఆదేశాలు



పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ఎంపీ, ఆ పార్టీ అగ్రనేత అభిషేక్ బెనర్జీకి కోల్‌కతా హైకోర్టులో ఊరట లభించింది. తన పార్లమెంట్ నియోజకవర్గమైన అంతాలాలోని కార్యాలయాన్ని కూల్చివేయకుండా చూడాలని ఆదేశించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు కూల్చివేత చర్యలు ఆపాలని సూచించింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత బీజేపీకి చెందిన కొందరు కార్యకర్తలు సౌత్ 24 పరగణాస్ జిల్లాలోని అంతాలా పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న అభిషేక్ బెనర్జీ ఆఫీసుపై దాడి చేశారు.అక్కడి ఫర్నీచర్ ధ్వంసం చేశారు. ఇదే సమయంలో ప్రభుత్వం ఈ ఆఫీసును కూల్చేందుకు ప్రయత్నించింది. దీంతో ఈ కూల్చివేతను అడ్డుకోవాలని కోరుతూ అభిషేక్ బెనర్జీకి చెందిన లీప్స్ అండ్ బౌండ్స్ సంస్థ కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించింది. దీనిపై అత్యవసర విచారణ చేపట్టాలని కోరింది. దీంతో జస్టిస్ రాజాబసు చౌదరితో కూడిన హైకోర్టు ధర్మాసనం దీనిపై విచారణ జరిపింది. అభిషేక్ బెనర్జీ ఆఫీసులో ఎలాంటి కూల్చివేతలు చేపట్టకూడదని ఆదేశించింది. ఇక, ఈ అంశంపై బెనర్జీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తన ఆఫీసు విషయంలో బీజేపీ గూండాలు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. పోలీసులు కూడా ఈ విషయంలో చట్టవ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని, తమ ఆఫీసులోని కంప్యూటర్లు, ఫర్నీచర్ వంటి వాటిని కూడా తీసుకెళ్లినట్లు ఆరోపించారు. మరోవైపు ఇప్పటికే కొంతవరకు అధికారులు బెనర్జీ ఆఫీసు కూల్చివేత చర్యలు చేపట్టారు. కోర్టు ఆదేశాలున్నప్పటికీ ఇలా చేయడం సరికాదని ఆయన విమర్శించారు. చట్టవ్యతిరేకంగా కూల్చివేతలు జరుగుతుంటూ పోలీసులు చూస్తూ ఉండిపోతున్నారని ఆయన అన్నారు. అయితే, ప్రస్తుతం జరుగుతున్న కూల్చివేతల్ని తక్షణమే ఆపాలని హైకోర్టు ఆదివారం ఆదేశించింది. ఈ విషయంలో తమ తదుపరి ఆదేశాలిచ్చేవరకు ఈ ఉత్వర్వులను పాటించాలని సూచించింది.

## విలేకరులపై దాడి చేసిన దుండగులను అరెస్ట్ చేయాలి



ఊట్కూర్ : నారాయణపేట జిల్లా కృష్ణ మండలంలో విలేకరులపై దాడి చేసిన దుండగుల ను వెంటనే అరెస్టు చేయాలని ఊట్కూర్ మండల ప్రెస్ క్లబ్ నాయకులు డిమాండ్ చేశారు. కృష్ణానదిలో అక్రమ ఇసుక రవాణా ను కవర్ చేసేందుకు వెళ్లిన నమస్తే తెలంగాణ మాగనూరు విలేకరి రాము, ఫోటోగ్రాఫర్ తాహెర్ అలీపై ఇసుక మాఫియా దాడికి పాల్పడటం ప్రజాస్వామ్యంపై జరిగిన దాడేనని వారు ఖండించారు.ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అక్రమాలను వెలుగులోకి తీసుకొస్తున్న పాత్రికేయులపై భౌతిక దాడులు చేయడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. అక్రమ ఇసుక దందాను అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తే ఇలాంటి ఘటనలు పునరావృతమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం పూర్తి హామీ ఇవ్వాలని, దోషులపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేసి శిక్షించాలని కోరారు.ఈ సమావేశంలో ఊట్కూర్ మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి, సీనియర్ నాయకులు అశోక్, విఠోబా, మంజూర్ అలీ, వెంకట్ రాములు, భానుచందర్, అష్ఫక్, సల్మాన్, నరసింహ, వెంకటేష్, అనీల్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల ఘాట్‌రోడ్డులో కారు బోల్తా.. హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు భక్తులకు గాయాలు

తిరుమల : తిరుమలలో శ్రీవారిని దర్శించుకునేందుకు వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు భక్తులకు ప్రమాదం జరిగింది . ఆదివారం ఉదయం తిరుమల రెండో ఘాట్ రోడ్డులో వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో వారు స్వల్పగాయాలయ్యాయి . దీంతో ఆ మార్గంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఘాట్ రోడ్డు భద్రతా సిబ్బంది అక్కడికి చేరుకుని కారును పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

# న్యాక్ సెంటర్ ఎప్పుడు ఓపెన్ చేస్తడో చెప్పాలే..

- ఆలస్యం చేసినందుకు ఎమ్మెల్యే అవమాన పడాలి
- 32నెలల్లో ఏం చేసిండని ప్రజలు ఆలోచన చేయాలి
- ఫస్ట్ ఎమ్మెల్యేగా పొన్నం మార్చిలోనే న్యాక్ సెంటర్ తెచ్చిండు
- ఓట్ల కోసం తప్ప అభివృద్ధి కోసం ఆలోచన చేయని ఎమ్మెల్యే
- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్





మంథని ( ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్రంలోనే అద్భుతం సృష్టించినట్లుగా గొప్పగా ప్రచారం చేసుకుంటున్న మంథనిలో న్యాక్ సెంటర్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారో మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ సమాజానికి జవాబు చెప్పాలని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ డిమాండ్ చేశారు. ఆదివారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంథని ఎమ్మెల్యే పనితనాన్ని చూస్తే జాలి కలుగుతాందని అన్నారు. దుద్దిళ్ల కుటుంబం ఓట్ల కోసం అలవాటు పడిందని, ఓట్ల కోసం తప్ప అభివృద్ధి కోసం ఏనాడు ఆలోచన చేయడం లేదని ఆయన అన్నారు, ఈ విషయాలను సమాజం దృష్టికి తీసుకువెళ్లే ప్రయత్నాలు చేస్తున్నానని ఆయన గుర్తు చేశారు. మంథనికి న్యాక్ సెంటర్ తీసుకువచ్చినా అని ఎదో గొప్పలు చెప్పుకుంటున్నారని ఆయన ఎద్దేవా చేశారు. 32నెలలు గడిచిన తర్వాత ఈ సెంటర్ తీసుకువచ్చినందుకు ఎమ్మెల్యే అవమాన పడాలని అన్నారు. 2004 నుంచి 2009 మధ్యలోనే జీవన్‌రెడ్డి జగిత్యాలకు తీసుకువచ్చారని ఆయన గుర్తు చేశారు. సమాజం మీద యాస ఉంటే అభివృద్ధి చేయాలనే ఆలోచన ఉంటే ఈ న్యాక్ సెంటర్ ఎప్పుడు తీసుకువచ్చే వారని ఆయన అన్నారు. దుద్దిళ్ల కుటుంబం ఎనిమిదో సారి ఎమ్మెల్యే స్థానంలో ఉన్నారని, మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ 25ఏండ్లు ఆయన తండ్రి 15ఏండ్లుగా అధికారంలో ఉంటున్నారని ఆయన తెలిపారు. మొదటి సారి ఎమ్మెల్యేగా, మంత్రిగా అయిన పొన్నం ప్రభాకర్ గత మార్చిలోనే న్యాక్ సెంటర్ తీసుకువచ్చారని, ఆనాడు రూ.20కోట్లు తీసుకువస్తే ఈనాడు రూ.40కోట్లు తీసుకురావాలే కానీ కేవలం రూ.20కోట్లు తెచ్చి గొప్పలు చెప్పుకోవడం, దాన్ని పత్రికలు గొప్పగా రాయడం చాలా బాధాకరమన్నారు అసలు నూతనం భవనం నిర్మాణం అయిన తర్వాత న్యాక్ సెంటర్ ప్రారంభిస్తారా లేక అద్దె భవనంలో ప్రారంభిస్తారో క్లారిటీ ఇవ్వడం లేదన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 32నెలలు గడిచిపోతుంది. రాష్ట్రంలో అంగన్వాడి సెంటర్లకు కోడిగుడ్డు బంద్ అని పేపర్లలో వచ్చిందని అన్నారు. పెద్దపల్లి కాటారం రోడ్డు పూర్తి చేయడానికి ఐదు ఆరు కోట్లు వచ్చించలేకపోతున్నారని, ప్రజలు సైతం రోడ్డెక్కి ధర్నా చేశారని ఆయన ఎద్దేవా చేశారు. అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఇలాంటి పనులు పూర్తి చేయాలే కానీ 32నెలల తర్వాత న్యాక్ సెంటర్ తీసుకువచ్చి ఏదో గొప్ప పని చేశామని చెప్పుకోవడం విడ్డూరమన్నారు. మంత్రిగా 32నెలల్లో ఏం చేసిండని ఆలోచన చేయాలని, ఈ విషయంపై పత్రికలు రివ్యూ చేసి కథనాలు రావాల్సిన అవసరం ఉందన్నారు. ఆనాడే జీవన్‌రెడ్డి జగిత్యాలలో 2009 ముందు 20కోట్లతో భవనం కట్టిండని, అలాంటి భవనం కట్టాలంటే ఈనాడు 40కోట్లు కావాలని కానీ మంథని ఎమ్మెల్యే తీసుకువచ్చిన 20కోట్లు తక్కువే కదా అని ఆయన అన్నారు. ఎక్కువ సంఖ్యలో ఉన్న ఈ సమాజం నీ కుటుంబానికి అవకాశం ఇస్తే అధికారంలోకి వచ్చినంక ఈ సమాజం గురించి ఏమీ ఆలోచించలేదని, ఈ సమాజానికి క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు ఇప్పటికే 32నెలలు గడిచిపోయిందని, మరో నాలుగు మాసాలు అయితే కాలం గడిచిపోతుందని అన్నారు. 32నెలల తర్వాత న్యాక్ సెంటర్ ఎందుకు తెచ్చినవో సమాజానికి జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పొన్నం ప్రభాకర్ మొదటిసారి ఎమ్మెల్యే ఆయనంక మార్చిలోనే జీఓ తెచ్చిండని, ఫస్ట్ టైం ఎమ్మెల్యే కన్నా వెనకబడి ఉన్నావని ఆయన విమర్శించారు. సొంత నియోజకవర్గం కాకపోయినా పొన్నం ప్రభాకర్ కరీంనగర్ బిడ్డగా నీకన్నా ముందు పని చేస్తున్నాడని, కూలగొట్టుడు, అక్రమ కేసులు పెట్టడం తప్ప అభివృద్ధి మీద దృష్టి లేదన్నారు. అభివృద్ధి పనులకు కాగితాలను చూపించి మోసం చేయద్దని, న్యాక్ సెంటర్‌ను ఎప్పుడు ప్రారంభిస్తరో, ఆలస్యం అయినందకు కారణం చెప్పాలని ఆయన ఈ సందర్బంగా డిమాండ్ చేశారు.

# కంటోన్మెంట్ బిఎల్ఓల పై జిహెచ్ఎంసికి కోపమా.?

- జంటనగరాల్లో ఉన్న "24" నియోజకవర్గాల పై జిహెచ్ఎంసి కి ఉన్న శ్రద్ధ కంటోన్మెంట్ పై లేకపోవడం శోచనీయం
- "సర్"పై ఎమ్మెల్యే ఫోకస్ కరెక్టే నా.?
- సికింద్రాబాద్ కంటోన్మెంట్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భేటీలతోరూట్ మ్యాప్ కుదిరేనా.?
- కంటోన్మెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే ముందు తల ఊపి ఫీల్డ్ లో కానరాకపోవడానికి గల కారణం.?
- నియోజకవర్గంలో "231"మంది బిఎల్ఓలు,
- ఎనిమిది వార్డులు,ఒక డివిజన్.2002 ఓటరు జాబితా ఉందా,లేదా.?
- తమ ఓటు లేదని లబో దిబో మంటున్న ప్రజలు.
- నియోజకవర్గంలో సరైన గుర్తింపు లేదని కొందరు.?
- గౌరవ వేతనం ఇస్తే లేరని బిఎల్ఓలు.?ఆగమైతున్న ఓటర్లు





కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో "231"మంది బుత్ లెవల్ అధికారులు సర్ కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్నారు.వీరిలో ఆశ వర్కర్లు,హెల్త్ డిపార్ట్మెంట్ కి చెందిన సిబ్బంది కలిసి 2023 నుంచి సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో వివిధ సేవలు అందిస్తున్నారు.గతమార్చ్ నుండి "సర్"ప్రక్రియ పై అవగాహన కార్యక్రమంలో పాల్గొని "2002"ఓటరు జాబితాతోమ్యాపింగ్ చేయడంలో శిక్షణ పొందారు.గత కొంతకాలంగా కంటోన్మెంట్ బోర్డు అధికారులు బిఎల్ఓలకు జీతభత్యాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు రెండు వందల ముప్పై రెండు మంది బోర్డు కార్యాలయం ముందు ధర్నా చేసిన విషయం విదితమే.ఎన్యూమరేషన్‌ఫారాల పై బిఎల్ఓల వ్యక్తి గత ఫోన్ నెంబర్లు ఓటర్లకు ఇవ్వడంతో సమయపాలన లేకుండా కాల్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారని మహిళలు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.అదిగాక కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారు.అనంతరం అధికారుల జోక్యంతో నిరసన విరమించి విధుల్లో పాల్గొన్నారు.ఈ నేపథ్యంలో గత కొన్ని రోజుల క్రితం సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు అధికారుల వద్ద ఉన్న "231"మంది బిఎల్ఓల సమాచారం ప్రకారం "133" మందికి జీతాలు చెల్లించినట్లు విశ్వసనీయ సమాచారం.అలాగే మిగిలిన "99"మంది మధ్యలో కొందరు మానేశారు.వారి స్థానంలో కొత్తగా బాధ్యతలు చేపట్టిన వారు విధులు నిర్వహిస్తున్నారు.ఈ తేడాతో ఎవరికి జీతభత్యాలు ఇవ్వాలో అర్థం గాక అయోమయంలో అధికారులు ? బిఎల్ఓలకు జీతాలు రాక వ్యక్తి గత సమస్యలు ఎక్కువై బాధల్లో ఉన్నారు.అంతర్గత విషయాలు బయటకు వెల్లడిస్తే మీ నౌకరీ హాం ఫట్ అంటూ అధికారులు బెదిరింపులకు దిగినట్లు విశ్వసనీయం సమాచారం.? ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ బిఎల్ఓల సమస్యలు పై ఫోకస్ చేస్తే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకుల జాడేది.?

సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్,జూనియర్ నాయకులు తీరే డిఫెరెంట్.స్థానికంగా పార్టీ నాయకులు చాలా తక్కువగా ఉన్న విషయం అందరికి తెలిసిందే.దాంట్లో కొంతమంది వ్యక్తులు సొంత వ్యాపారాల్లో బిజీ బిజీగా ఉంటూ,ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి ఫోన్ వస్తేగాని ఎమ్మెల్యే కార్యక్రమాలకు హాజరు కారు.? ఇక మరి కొందరు అయితే ఎమ్మెల్యే పై వ్యక్తి గత అభిమానంతో ప్రొగ్రామ్‌లకు వస్తుంటారు.ఇక అసలైన విషయం ఏమిటంటే శాసన సభ్యులు శ్రీ గణేష్ తో నామినేటెడ్ పదవులు లబ్ధి పొందిన వారు కార్యక్రమం చివరిలో "మెరుపు " లా దర్శనం ఇస్తున్నారు.కొందరైతే అసలే రారు వారి రూటే సపరేట్.ఇన్ని వైవిధ్యాలు చూపిస్తున్న స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు "సర్"విషయంలో మాత్రం తాత్సారం చేయకుండా ఇలా వచ్చి అలా జారు కుంటున్నారు.ఇదే వ్యవహారం ముందు ముందు కొనసాగుతే పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.?ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పార్టీ సీనియర్లతో శాసనసభ్యులు భేటీ సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో "సర్" ప్రక్రియ పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని సూపర్ వైజర్స్,ఇంచార్జ్,కో-ఆర్డినేటర్లు తో ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలో సర్ ప్రక్రియ జరుగుతున్న విధానం,ఫీల్డ్ లో ఎదురవుతున్న సవాళ్లు పై అందరితో సుదీర్ఘంగా చర్చించారు.అలాగే స్థానిక ప్రజలకు, బిఎల్ఓలకు ఏమైనా సమస్యలు ఉత్పన్నం అవుతే యుద్ధప్రాతిపదికన సమస్యను పరిష్కరించడానికి కృషి చేయండి అంటూ పిలుపునిచ్చారు. ఒకవేళ మీ స్థాయిలో సమస్య పరిష్కారం కాకపోతే నా దృష్టికి తీసుకువస్తే అధికారులతో చర్చించి ప్రాబ్లం క్లొజ్ చేద్దాం అని అన్నారు.అదిగాక మీ పరిధిలో ఉన్న ఓటర్లతో మమేకం అయ్యి వారి సాధకబాధకాలు చూసే బాధ్యత కూడా మీదే అని గుర్తు చేశారు.భవిష్యాత్తులో మీరు ఉన్నత స్థానానికి ఎదగాలంటే ప్రజల ఆశీస్సుల చాలా ముఖ్యం మని,అప్పుడే మీ సత్తా కూడా ఏంటో తెలుస్తుంది అని ఆయనతెలిపారు.మరో విషయం ఏమిటంటే గ్రౌండ్లో జరుగుతున్న ప్రతి విషయాన్ని తన దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

# రామన్నగూడెం మాల కుల సంఘం నూతన కమిటీ ఎన్నిక


**104 మంది సభ్యుల సమక్షంలో ఏకగ్రీవ ఎన్నిక. కుల అభివృద్ధికి పరపతి సంఘం ఏర్పాటుకు తీర్మానం.**

ఏటూరు నాగారం ( ప్రశ్న న్యూస్) రామన్నగూడెం గ్రామంలోని మాల కుల కుటుంబాల సభ్యులు ఆదివారం సమావేశమయ్యారు. గ్రామంలోని 104 మంది సభ్యుల సమక్షంలో కుల పెద్ద మనిషి ఎన్నిక, కుల కట్టుబాట్లు, ఇతర వ్యవహారాలపై విస్తృతంగా చర్చలు జరిగాయి. సభ్యులు చేసిన సలహాలు, సూచనల మేరకు నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారుడు జూపాక కృష్ణ మాట్లాడుతూ ఈరోజు మనమందరం ఒకే తాటిపైకి వచ్చి నూతన కమిటీని ఎన్నుకోవడం చాలా సంతోషంగా ఉంది. కుల ఐక్యతే మన బలం. గతంలో ఉన్న మంచి ఆచారాలను కొనసాగిస్తూనే, నేటి కాలానికి అనుగుణంగా మార్పులు తీసుకురావాలి. మన పిల్లల చదువులు, యువతకు ఉపాధి అవకాశాలు, ఆడబిడ్డల సంక్షేమం మీద ప్రత్యేకంగా దృష్టి పెట్టాలి. నూతన కమిటీ అందరితో కలిసి, ఎలాంటి బేధాలు లేకుండా కుల అభివృద్ధికి కృషి చేస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ అందించే బాధ్యత కూడా మనపై ఉంది అని అన్నారు. అనంతరం కుల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించి పలు తీర్మానాలు చేశారు.

## ఎన్నికైన నూతన కమిటీ వివరాలు.

**ప్రధాన కార్యవర్గం**
**అధ్యక్షులు జనగాం రామచంద్రం**
**ఉపాధ్యక్షులు కారం పోశాలు**
**ప్రధాన కార్యదర్శి గద్దల జగన్**
**కార్యదర్శి కాట రాంబాబు**
**ప్రచార కార్యదర్శులు ఎమునూరి సృజన్, కిన్నెర రాజు**
**గౌరవ సలహాదారులు**

గద్దల నవీన్, చెన్నూరి బాలరాజు, జూపాక కృష్ణ, గద్దల సత్యనారాయణ, జూపాక అర్జున్, గద్దల కృష్ణ, గద్దల ప్రణయ్ కార్యనిర్వాహక సభ్యులు చెన్నూరి సత్యం, గద్దల బాణయ్య, బండి



వెంకట్, జూపాక భీమయ్య, గద్దల తిరుపతయ్య, పోతురాజు కుమారస్వామి, ఎనమల్ల నారాయణ, గద్దల సూర్యనారాయణ సమావేశంలో నూతన కమిటీ అధ్వర్యంలో కుల అభివృద్ధి కార్యక్రమాలను ముమ్మరం చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా కుల సభ్యులకు ఆర్థిక సహాయం అందించేందుకు పరపతి సంఘం ఏర్పాటు చేయాలని తీర్మానం చేశారు.

# పొలం గట్లపై అర కిలోమీటర్ మేర బాధితురాలిని మోసుకెళ్లిన 108 సిబ్బంది

## సేవలకు గ్రామస్తుల ప్రశంసలు



సిరిసిల్ల(ప్రశ్న న్యూస్) ప్రమాదవశాత్తు పొలం గట్టు పై నుంచి జారి కిందపడడంతో ఆమె కాలుకు తీవ్ర గాయమై ఫ్రాక్చర్ అయింది.సమాచారం అందుకున్న 108 అత్యవసర అంబులెన్స్ సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్స్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. వివరాల్లోకి వెళితే గంభీరావుపేట మండలం భీముని మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన లక్ష్మీ నరసవ్వ (60) వరి నాట్లు వేస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పొలం గట్టు పై నుంచి జారి కిందపడడంతో ఆమె కాలుకు తీవ్ర గాయమై ఫ్రాక్చర్ అయింది.సమాచారం అందుకున్న 108 అత్యవసర అంబులెన్స్ సిబ్బంది ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ ఈ ఎం టి పిల్లి సతీష్, పైలట్ మైల కుమారస్వామి హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. అయితే, ప్రమాదం జరిగిన ప్రాంతానికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో వారు సేవాభావంతో స్కూప్ స్ట్రెచర్ సహాయంతో బాధితురాలిని పొలం గట్లపై నుంచి సుమారు అర కిలోమీటర్ మేర మోసుకెళ్లి అంబులెన్స్ వద్దకు తీసుకువచ్చారు.అనంతరం బాధితురాలికి ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్య సేవల నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి సురక్షితంగా తరలించారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ సమయానికి స్పందించి, తమ విధి నిర్వహణలో అంకితభావాన్ని చాటుకున్న 108 సిబ్బంది సేవలను గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజల ప్రాణాలను కాపాడటంలో 108 అత్యవసర అంబులెన్స్ సేవలు ఎల్లప్పుడూ ముందుంటాయని తెలియజేశారు.

# గజ్వేల్ బొడ్రాయి పండుగ ఏర్పాట్లపై ప్రముఖులతో మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి చర్చ



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ )గజ్వేల్ పట్టణంలో నిర్వహించనున్న బొడ్రాయి పండుగను వైభవంగా, సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే శ్రీ తూంకుంట నర్సారెడ్డి పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, కౌన్సిలర్లతో కలిసి సమావేశమయ్యారు.ఈ సమావేశంలో బొడ్రాయి పండుగ ఏర్పాట్లు, భక్తులకు అవసరమైన సౌకర్యాలు, భద్రతా చర్యలు, పారిశుద్ధ్యం, ట్రాఫిక్ నిర్వహణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ప్రజలందరి సహకారంతో పండుగను విజయవంతం చేయాలని నర్సారెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చందన రవీందర్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్తా, శ్రీధర్ రావు, తలకోక్కుల దుర్గాప్రసాద్, గుంటుకు మల్లేశం, గజ్వేల్ పట్టణ ప్రముఖులు, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని పండుగ నిర్వహణకు సంబంధించి తమ సూచనలు అందించారు.

# తృణమూల్ రెబెల్స్‌కు ఆహ్వానం..

## అఖిలపక్ష సమావేశం నుంచి ప్రతిపక్షాల వాకౌట్



న్యూఢిల్లీ: పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందు సంప్రదాయంగా జరిగే అఖిలపక్ష సమావేశం నుంచి ప్రతిపక్షాలు కొంతసేపు వాకౌట్ చేశాయి. తృణమూల్ రెబెల్స్‌ను మీటింగ్‌కు ఆహ్వానించడంపై ప్రతిపక్షాల నేతలు మండిపడ్డారు. టీఎంసీ అసమ్మతి ఎంపీల విలీనానికి అధికారిక ఆమోదం లభించకుండానే ఎన్సీపీఐని ఎలా ఆహ్వానిస్తారని ప్రశ్నించారు. పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం మమతా బెనర్జీ స్థాపించిన టీఎంసీ పార్టీకి చెందిన సుమారు 20 మంది అసమ్మతి ఎంపీలు జూన్‌లో నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్సీపీఐ)లో విలీనమయ్యారు. అయితే గుర్తింపు, పార్లమెంట్ వెబ్‌సైట్‌లో పేరు కూడా లేని ఆ పార్టీని అఖిలపక్ష సమావేశానికి కేంద్రం ఆహ్వానించడం ఆందోళన కలిగించే విషయమని టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ విమర్శించారు. ఎన్సీపీఐలో చేరిన ఆ 20 మంది అసమ్మతి ఎంపీల వివరాలను పార్లమెంట్ వెబ్‌సైట్ ఇప్పటికీ తృణమూల్ సభ్యులుగానే చూపిస్తోందని అన్నారు. కాగా, స్పీకర్ వద్ద తుది నిర్ణయం ఇంకా పెండింగ్‌లో ఉండగానే, 20 మంది టీఎంసీ రెబల్స్ ఎంపీలు విలీనమైన ఎన్సీపీఐని అఖిలపక్ష సమావేశానికి ఆహ్వానించిన మోదీ ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా ప్రతిపక్ష పార్టీలన్నీ కొన్ని నిమిషాల పాటు సమావేశం నుంచి వాకౌట్ చేశాయని రాజ్యసభలో ప్రతిపక్ష ఉప నాయకుడైన కాంగ్రెస్ నేత ప్రమోద్ తివారీ తెలిపారు. ఎన్సీపీఐని కేంద్రం ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ ప్రతిపక్షాలు చేపట్టిన 'ప్రతీకాత్మక బహిష్కరణ' అని ఆయన అభివర్ణించారు.మరోవైపు పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ప్రతిపక్షాలు సిద్ధమయ్యాయి. రామ మందిర విరాళాల కుంభకోణమే తమ అతిపెద్ద సమస్య అని కాంగ్రెస్ తెలిపింది. నీట్ పేపర్ లీక్, వ్యవసాయం, పెట్రోల్‌లో ఈ20 మిశ్రమం వంటి ఇతర సమస్యలు ఉన్నాయని పేర్కొంది. నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకిస్తామని కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది.

# తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ..

## హుండీ ఆదాయం రూ.3.66 కోట్లు

తిరుమల : భక్త రక్షకుడు.. నిత్యకల్యాణుడు కొలువుదీరిన తిరుమల వేంకటేశ్వర స్వామి సన్నిధిలో భక్తుల రద్దీ కొనసాగుతుంది . వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 31 కంపార్టుమెంట్లు నిండిపోయి శిలాతోరణం వరకు క్యూలైన్లో నిలబడ్డారు. టోకెన్లు లేని భక్తులకు 24 గంటల్లో సర్వదర్శనం అవుతుందని టీటీడీ అధికారులు వివరించారు. శనివారం స్వామివారిని 74,096 మంది భక్తులు దర్శించుకోగా 36,562 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.66 కోట్లు ఆదాయం వచ్చిందని వివరించారు. భక్తులకు నాలుగు లక్షల లడ్డూలను విక్రయించామని, 2.96 లక్షల మందికి అన్న ప్రసాదం అందజేశామని వెల్లడించారు.

## తగ్గేదేలే.. రిషబ్ శెట్టి కాంతార చాప్టర్ 1 మరో అరుదైన రికార్డు..!



శాండల్‌వుడ్ నుంచి రిలీజ్ తెలుగుతోపాటు గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేసిన చిత్రాల్లో టాప్‌లో ఉంటుంది కాంతార. కన్నడ స్టార్ రిషబ్ శెట్టి స్వీయ దర్శకత్వంలో లీడ్ రోల్‌లో నటించిన పాన్ ఇండియా ప్రాజెక్ట్‌కు ప్రీక్వెల్‌గా కాంతార చాప్టర్ 1 వచ్చిందని తెలిసందే. తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ట్రెండ్ క్రియేట్ చేసింది. 2025లో విడుదలై హయ్యెస్ట్ గ్రాస్ సాధించిన భారతీయ సినిమాల జాబితాలో టాప్‌లో నిలిచిన కాంతార చాప్టర్ 1 ఖాతాలో అత్యంత అరుదైన రికార్డు నమోదైంది. బీ అజనీష్ లోక్‌నాథ్ కంపోజ్ చేసిన బ్రహ్మలక్ష సాంగ్ 1 మిలియన్స్ రీల్స్ అధిగమించిన తొలి కన్నడ పాటగా అరుదైన ఫీట్ నమోదు చేసింది. ప్రపంచవ్యాప్తంగా మూవీ లవర్స్ విస్తృతంగా రీల్స్ చేయడంతో ఈ చారిత్రక మైల్‌స్టోన్ రికార్డైంది. సినిమా విడుదలైన ఏడాది దాటినా రికార్డులు క్రియేట్‌చేస్తూ టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలుస్తోంది. డివైన్, మిథికల్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కిన ఈ మూవీలో రుక్మిణి వసంత్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించగా.. జయరామ్, ప్రమోద్ శెట్టి, ప్రకాశ్ తుమినాడ్, గుల్షన్ దేవయ్య ఇతర కీలక పాత్రలు పోషించారు. కాంతార 3 కూడా రాబోతుండగా.. త్వరలోనే సెట్స్‌పైకి వెళ్లనున్నట్టు సమాచారం.




## ఉన్మాదం'... మలయాళం నుంచి వెన్నులో వణుకు పుట్టించే హారర్ మూవీ!

మలయాళ చిత్ర పరిశ్రమ నుంచి మరో అద్భుతమైన ఇన్వెస్టిగేటివ్ హారర్ థ్రిల్లర్ రాబోతోంది. విభిన్నమైన కథలతో ఆకట్టుకునే మాలీవుడ్ నుంచి వస్తున్న ఈ సినిమా పేరు 'ఉన్మాదం'. ప్రముఖ నటుడు కుంచాకో బోబన్, లిజోమోల్ జోస్ ప్రధాన పాత్రలలో నటించిన ఈ చిత్రానికి కిరణ్ దాస్ దర్శకత్వం వహించారు. తాజాగా విడుదలైన ఈ చిత్ర అధికారిక ట్రైలర్, ప్రేక్షకులలో విపరీతమైన ఆసక్తిని రేకెత్తిస్తోంది. ముఖ్యంగా హారర్, థ్రిల్లర్ ప్రియులను ఇది విపరీతంగా ఆకట్టుకుంటోంది. ట్రైలర్ ప్రకారం, కథ చాలా ఉత్కంఠభరితంగా సాగనుంది. కొంగడ్ పోలీస్ స్టేషన్‌లోని 'కేస్ నంబర్ 174' గురించి హీరో (కుంచాకో బోబన్) తన పై అధికారిని అడగడంతో ట్రైలర్ మొదలవుతుంది. ఆ ఫైల్‌ను ముట్టుకోవడానికి కూడా స్టేషన్‌లోని ప్రతి ఒక్కరూ భయపడుతున్నారని హీరో చెప్పడం కథలోని మిస్టరీని పరిచయం చేస్తుంది. "పాతిపెట్టిన ప్రతి నిజానికి, తన గొంతును కనుగొనే మార్గం ఉంటుంది" అనే క్యాప్షన్‌తో మేకర్స్ ట్రైలర్‌ను పంచుకున్నారు. ఆరేళ్ల క్రితం జరిగిన ఈ కేసులో పోలీసులు సాధారణంగా అడిగే 'ఎవరు, ఎప్పుడు, ఎక్కడ, ఎలా, ఎందుకు' అనే ప్రశ్నలకు లభించిన సమాధానాలలో ఏదీ అనుమానం కలిగించకపోవడమే ఈ కేసులోని అసలు చిక్కుముడి అని పై అధికారి వివరిస్తారు. ఈ కేసును మళ్లీ తిరగదోడటం ప్రమాదకరమని, ప్రయత్నించిన వారంతా ఇబ్బందుల్లో పడ్డారని హీరోయిన్ (లిజోమోల్ జోస్) హీరోను హెచ్చరిస్తుంది. అయినా కూడా హీరో ఆ ఫైల్‌ను ఓపెన్ చేస్తాడు. ఈ విషయం పై అధికారులకు తెలిస్తే ఉద్యోగం కూడా పోయే ప్రమాదం ఉంటుంది. ఈ కేసులో దెయ్యాలు, ఆత్మలు ఉన్నాయని కింది స్థాయి పోలీసులు బలంగా నమ్ముతుంటే, పై అధికారులు మాత్రం మూఢనమ్మకాలుగా కొట్టిపారేస్తుంటారు. ట్రైలర్‌లో ఓ పంచమి రాత్రి జరిగే భయానక సంఘటనలు, వెంట్రుకవాసిలో చావు నుంచి హీరో తప్పించుకోవడం వంటి థ్రిల్లింగ్ సన్నివేశాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి. మొత్తం మీద 'ఉన్మాదం' ట్రైలర్ ఒక పక్క ఇన్వెస్టిగేటివ్ క్రైమ్ థ్రిల్లర్‌గా, మరోపక్క వెన్నులో వణుకు పుట్టించే హారర్ డ్రామాగా సినిమాపై భారీ అంచనాలను క్రియేట్ చేస్తోంది. పనోరమా స్టూడియోస్ బ్యానర్‌పై కుమార్ మంగత్ పాఠక్, అభిషేక్ పాఠక్ నిర్మించిన ఈ చిత్రానికి ముజీబ్ మజీద్ సంగీతం అందించారు. ఈ సినిమా జూలై 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

## కేజీఎఫ్ డైరెక్టర్ హార్రర్ సినిమా..

### - 418 రిలీజ్ టైం ఫిక్స్



మూవీ లవర్స్‌కు కమర్షియల్ ఎంటర్‌టైనర్లను అందించిన బ్యానర్లలో టాప్‌లో ఉంటుంది మైత్రీ మూవీ మేకర్స్. కానీ ఈ వెంచర్‌లో ఇప్పటివరకు హార్రర్ జోనర్‌లో మాత్రం సినిమా రాలేదు. ఈ సారి మైత్రీ మూవీ మేకర్స్ 418 సినిమాతో హార్రర్ జోనర్‌లోకి తొలిసారి ఎంటరైంది. పతంగ్ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకున్న ఇంటర్నెట్, సోషల్ మీడియా పర్సనాలిటీ ప్రీతి పగడాల ఈ మూవీలో లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. చరణ్ లక్కరాజు, సూర్య రాజ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కీర్తన్ నాదగౌడ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాను కేజీఎఫ్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్నాడు. తెలుగు హార్రర్ ఫిల్మ్ విడుదల తేదీని ప్రకటించారు. 418 చిత్రాన్ని జులై 31న గ్రాండ్‌గా విడుదలచేస్తున్నట్టు ప్రకటించారు. ముంగురులు తిరిగిన పొడవాటి కురులతో ఉన్న ఓ యువతికూర్చున్న బ్యాక్ లుక్‌ను షేర్ చేయగా.. సినిమాపై క్యూరియాసిటీ పెంచేస్తుంది. దినేశ్ దినకరన్, సినిమాటోగ్రఫర్‌గా పనిచేస్తున్న ఈ చిత్రానికి వెంకీ జీజీ మ్యూజిక్ కంపోజర్‌గా వ్యవహరిస్తున్నాడు.

## కథనంతో కదం తొక్కిన లెక్కల మాస్టారు




సుకుమార్.. టాలీవుడ్ డైరెక్టర్లలో ఎస్.ఎస్.రాజమౌళి తర్వాత ఎక్కువగా వినిపించే పేరు ఇదే. ఆర్య, 100 పర్సంట్ లవ్, నాన్నకు ప్రేమతో, రంగస్థలం, పుష్ప, పుష్ప2.. ఈ సినిమాలు దర్శకుడిగా ఆయనేంటో చెబుతాయి. 'రంగస్థలం' సినిమాతో దర్శకునిగానే కాక, కథకునిగా కూడా ఆయన కితాబులందుకున్నారు. గత ఏడాది 'పుష్ప' చిత్రానికి జాతీయ ఉత్తమ నటుడిగా అల్లు అర్జున్ ఎంపికయ్యారంటే, అందులో సుకుమార్ పాత్ర ఎంతోవుంది. తాజాగా 'పుష్ప-2'కు ఆయన ఉత్తమ స్క్రీన్‌ప్లే రైటర్‌గా జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. డైరెక్టర్ సుకుమార్ కీర్తికిరీటంలో దీన్ని ఓ కలికితురాయిలా చెప్పుకోవచ్చు. 'పుష్ప-2' చిత్రం ఆయన కథన కౌశలంతో బాక్సాఫీస్ బరిలో సంచలనాల్ని సృష్టించిన విషయం తెలిసిందే.

## రామాయణం సినిమా కాదు

### భారత్‌ను ప్రపంచానికి పరిచయం చేసే ప్రయాణం: రకుల్

**ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణం' చిత్రంలో భాగం కావడం తనకు గర్వకారణమని హీరోయిన్ రకుల్ ప్రీత్ సింగ్ పేర్కొంది. ఇది కేవలం ఓ సినిమా కాదని, భారత చరిత్ర, సంస్కృతి, వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేసే గొప్ప ప్రయాణమని చెప్పింది. ఈ చిత్రంతో ప్రేక్షకులు ఓ అద్భుతమైన ప్రపంచంలోకి అడుగుపెట్టబోతున్నారని తెలిపింది.ఢిల్లీలో ఇటీవల జరిగిన 'రామాయణం' ట్రైలర్ లాంచ్ కార్యక్రమానికి సంబంధించిన ఫొటోలను రకుల్ ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకుంది. ఈ సందర్భంగా తన ఆనందాన్ని అభిమానులతో పంచుకుంటూ.. ఇంత భారీ స్థాయి చిత్రంలో భాగం కావడం జీవితాంతం గుర్తుండిపోయే అనుభూతిగా అభివర్ణించింది. భారత్‌కు ప్రపంచ వేదికపై ప్రాతినిధ్యం వహిస్తున్న భావన మాటల్లో చెప్పలేనిదని తన పోస్టులో పేర్కొంది.నితేశ్ తివారీ తెరకెక్కిస్తున్న ఈ పౌరాణిక చిత్రంలో రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖ పాత్రలో కనిపించనుంది. రావణాసురుడి సోదరిగా కథలో కీలక పాత్ర పోషించనున్న ఆమె లుక్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్, సీతగా సాయి పల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు.రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ చిత్రంలో తొలి భాగాన్ని 2026 దీపావళికి విడుదల చేయనున్నారు. రెండో భాగం 2027 దీపావళికి ప్రేక్షకుల ముందుకు రానుంది. భారీ బడ్జెట్‌తో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సినిమాను నిర్మిస్తున్నారు.**



## పొలిమేర 3లో యాక్షన్ కింగ్ అర్జున్..

### - ఇంతకీ రోల్ ఏంటో మరి..?




టాలీవుడ్‌లో సూపర్ క్రేజ్ సంపాదించిన పాపులర్ థ్రిల్లర్ ఫ్రాంచైజీల్లో టాప్‌లో ఉంటుంది మా ఊరి పొలిమేర. సత్యం రాజేశ్ కామాక్షి భాస్కర్ల, బాలాదిత్య లీడ్ రోల్స్‌లో నటించిన ఫస్ట్ పార్ట్ కోవిడ్ టైంలో డిస్నీ ప్లస్ హాట్ స్టార్‌లో ఎంట్రీ ఇచ్చి సూపర్ హిట్ టాక్ తెచ్చుకుంది. ఆ తర్వాత సీక్వెల్ మా ఊరి పొలిమేర 2 థియేటర్లలో విడుదలైన బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. డాక్టర్ అనిల్ విశ్వనాథ్ దర్శకత్వం వహించిన ఈ ఫ్రాంఛైజీలో మూడో పార్టు పొలిమేర 3 కూడా అధికారికంగా ప్రకటించారని తెలిసిందే. పొలిమేర 3కు సంబంధించిన ఆసక్తికర వార్త మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతోంది. ఇందులో తెలుగులో సూపర్ ఫ్యాన్ బేస్ ఉన్న యాక్షన్ కింగ్ అర్జున్ కీలక పాత్రలో కనిపించబోతున్నాడన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఒకవేళ ఇదే నిజమైతే అర్జున్‌ను డైరెక్టర్ అనిల్ విశ్వనాథ్ ఎలాంటి పాత్రలో చూపించబోతున్నాడన్నది సస్పెన్స్ క్రియేట్ చేస్తూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేస్తోంది. ఇప్పటికే పొలిమేర 3అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచేస్తున్నారు మేకర్స్. పొలిమేర 2ను పంపిణీ చేసిన వంశీ నందిపాటి భోగేంద్ర గుప్తాతో కలిసి పొలిమేర 3 నిర్మిస్తున్నారు. భోగేంద్ర గుప్తా ఫస్ట్ పార్టుకు నిర్మాతగా వ్యవహరించగా.. పొలిమేర 3కి భోగేంద్ర గుప్తా సహ నిర్మాతగా వ్యహరిస్తున్నారు. ఈ చిత్రంలో గెటప్ శీను, రాకేందు మౌళి, సాహిత్య దాసరి, రవివర్మ ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఇప్పటికే ఫస్ట్ పార్టు, సెకండ్ పార్టు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా నిలిచాయి. మరి ఇదే జోనర్‌లో కొనసాగింపుగా వస్తోన్న ట్రీక్వెల్ ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందనేది చూడాలి.

# తెలంగాణ ఉద్యమకారులను విస్మరిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికీ అదే గతి తప్పదు

- డాక్టర్ చీమ శ్రీనివాస్
- ఎల్లంపేట పురపాలక సంఘం అధ్యక్షుడిగా బ్రాహ్మండ్లపల్లి సుదర్శన్
- కేకే కమిటీ పేరుతో కాలయాపన వద్దు
- స్థానిక సంస్థల ఎన్నికల్లో 20% రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే
- కేసీఆర్ సర్కార్‌ను ముంచింది ఉద్యమకారుల శాపమే
- తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నూతన కమిటీ నియామకం



మేడ్చల్ (ప్రశ్న న్యూస్ ) ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను ధారబోసిన ఉద్యమకారుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించవద్దని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని ఒక ఫామ్ హౌస్‌లో తెలంగాణ ఉద్యమకారుల ముఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులను గుర్తించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేకే కమిటీ పేరుతో కాలయాపన చేయకుండా, సత్వరమే అర్హులను గుర్తించి న్యాయం చేయాలని కోరారు.

### స్థానిక సంస్థల ఎన్నికల్లో 20% రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు తెలంగాణ ఉద్యమకారులకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డాక్టర్ చీమ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. అన్ని పార్టీల్లోనూ దశాబ్దాలుగా శ్రమించిన ఉద్యమకారులకు సరైన గుర్తింపు దక్కాల్సిన అవసరం ఉందన్నారు. ఒకవేళ రాజకీయ పార్టీలు ఈ డిమాండ్‌ను పక్కనబెడితే, ఉద్యమకారులంతా ఏకతాటిపైకి వచ్చి రాబోయే ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థులుగా (ఇండిపెండెంట్లుగా) బరిలోకి దిగుతామని ఆయన హెచ్చరించారు. జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల తరహాలోనే తెలంగాణలోనూ ఉద్యమకారులకు ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేయాలి. రాష్ట్రం కోసం సర్వస్వం కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని డాక్టర్ చీమ శ్రీనివాస్ అన్నారు.

### కేసీఆర్ సర్కార్ కు పట్టిన గతే పడుతుంది..

గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై కూడా ఆయన ఈ సందర్భంగా తీవ్ర విమర్శలు చేశారు. "కేసీఆర్ పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకునే నాడు ఉద్యమించాం, ఆయన వల్లే రాష్ట్రం వచ్చిందన్న మాట నిజమే. కానీ, అధికారంలోకి వచ్చాక కేసీఆర్ ఉద్యమకారులను పూర్తిగా విస్మరించారు. ఆ పాపమే వారిని ఈ రోజు అధికారానికి దూరం చేసింది" అని గుర్తు చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తప్పు పునరావృతం చేయకుండా, ఇచ్చిన మాట ప్రకారం ఉద్యమకారుల సంక్షేమానికి తక్షణమే నిధులు, పథకాలు కేటాయించాలని కోరారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం బలోపేతానికి ఎల్లంపేట పురపాలక సంఘం అధ్యక్షుడిగా బ్రాహ్మండ్లపల్లి సుదర్శన్, నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా పీట్ల సాయిలుకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా నూతన బాధ్యతలు చేపట్టిన ఉద్యమకారులు మాట్లాడుతూ ఉద్యమకారుల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో టీయూఎఫ్ జిల్లా అధ్యక్షుడు జిట్టా శ్రీనివాస్ రెడ్డి, ముఖ్య నాయకులు సత్తి రెడ్డి, తలారి అశోక్ ముదిరాజ్, జక్కుల కుమార్, రాంచందర్, యాదయ్య, బాలరాజు, బిక్షపతి, చందర్, కురకుల మహేష్, తలారి ప్రభాకర్, ఎండీ రఫీక్, జి.అశోక్, సాయిబాబు, టీ లక్ష్మణ్, రెడ్డి నాయక్, లింగం గౌడ్, మీట్యా నాయక్, భాస్కర్, శ్రీకాంత్ నాయక్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సీఈఓ ను పరామర్శించిన ఎఫ్ పి ఓ వెంకటరెడ్డి



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) కొల్చారం పరిధిలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన రంగంపేట సీఈవో నవీన్ కుమార్ తండ్రి మల్లేశం ఇటీవలే మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని ఆదివారం నాడు కిష్టాపూర్ గ్రామానికి వచ్చేసి వారి కుటుంబానికి ప్రగాడ సంతాపం తెలియజేసి వారి కుటుంబానికి మన ధైర్యం కల్పించారు వారి కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎఫ్ఈఓ వెంకట్ రెడ్డి హామీ ఇచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇలాంటి మంచి వ్యక్తి మన మధ్యలో లేనందుకు చాలా బాధాకరం ఉందని వారు తెలిపారు ఇలాంటి ఘటనఏ కుటుంబంలలో రాకూడదని ఎఫ్ఏఓ వెంకట్ రెడ్డి చింతిస్తున్నారు ఈ ప్రగడ సానుభూతిలో పాల్గొన్న రాజేష్ గౌడ్, చిన్న ఘనపూర్ నవీన్ కుమార్, జర్నలిస్టు నాగరాజుగౌడ్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## వర్షాల కోసం మల్లన్నస్వామికి జలాభిషేకం

### కురుమ సంఘం ఆధ్వర్యంలో వరుణదేవుని ఒగ్గుకథ లో పాల్గొన్న మున్సిపల్ వైస్‌చైర్మన్ నరేష్‌గౌడ్




మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండి ప్రజలంతా సంతోషంగా ఉండాలని మెదక్ మున్సిపల్ చైర్మన్ నరేష్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం మెదక్ పట్టణంలోని నవాబుపేటవీధిలో మల్లన్నస్వామి ఆలయంలో మల్లన్న స్వామికి జలాభిషేకంతోపాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా వరుణ దేవునిపై ఒగ్గుకథ చెప్పారు. కుర్మసంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ నరేష్‌గౌడ్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్తెలు కరిగి పోతున్నా.. వర్షాలు లేక జిల్లాలో వరి నారుపోసిన రైతులు ఆకాశం వైపు ఆశగా ఎదురు చూస్తున్నారు. కరువు ఛాయలు తొలగిపోయి సమృద్ధిగా వర్షాలు కురియాలంటూ వరుణదేవుని పూజలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు వరుణ దేవుని పాటపాడుతూ బతుకమ్మ ఆడారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు పెంటయ్య, ఆశయ్య, సాయిలు ,లింగం, మల్లయ్య, ఒగ్గ కళాకారులు దుర్గయ్య, వెంకట్ రాములు, బీరప్ప, బిక్షపతి, యాదగిరి, స్థానిక ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# చిత్రలేఖనంలో గజ్వేల్ చిన్నారి అరుదైన ప్రపంచ రికార్డు

- గంటా 15 నిమిషాల్లో 50 అద్భుత చిత్రాలు, "విశ్వగురు వరల్డ్ రికార్డు"
- సొంతం చేసుకున్న ఐదున్నరేళ్ల మాస్టర్ వేదార్త్
- గజ్వేల్‌కు చెందిన చిన్నారి ప్రతిభకు దేశవ్యాప్తంగా ప్రశంసలు





గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) గజ్వేల్ పట్టణానికి చెందిన, ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న డాక్టర్ ఉప్పల మణికంఠ, డాక్టర్ శ్రీలత దంపతుల కుమారుడు ఐదున్నరేళ్ల మాస్టర్ వేదార్త్ చిత్రలేఖనంలో అసాధారణ ప్రతిభ కనబరిచి అరుదైన ప్రపంచ రికార్డును సొంతం చేసుకున్నాడు. చిన్న వయసులోనే అద్భుతమైన ఏకాగ్రత, సృజనాత్మకతతో "విశ్వగురు వరల్డ్ రికార్డు" సాధించి గజ్వేల్ ప్రాంతానికి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాడు. ఆదివారం హైదరాబాద్‌లోని నిజాంపేట్ కేపీఆర్ దివ్య ప్రభాస్ ఎన్‌క్లేవ్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో, సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థి వేదార్త్ గంటా 15 నిమిషాల్లో "ఏనుగు" థీమ్‌పై 50 విభిన్న చిత్రాలను ప్రత్యక్షంగా గీసి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచాడు. ప్రతి చిత్రంలో వైవిధ్యం, భావ వ్యక్తీకరణ, సృజనాత్మకత ప్రతిబింబించడం విశేషం. ఈ ప్రదర్శనను పరిశీలించిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు వేదార్త్ ఘనతను అధికారికంగా లిలి"విశ్వగురు వరల్డ్ రికార్డు"లిలిగా నమోదు చేసినట్లు ప్రకటించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం మాట్లాడుతూ, "ఇంత చిన్న వయసులో ఇంతటి కళా నైపుణ్యం, భావ వ్యక్తీకరణ చాలా అరుదు. వేదార్త్ భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునే ప్రతిభావంతుడు" అని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఫౌండర్, సీఈఓ డాక్టర్ సత్యవోలు రాంబాబు, డాక్టర్ సారంగపాణి, ప్రముఖ చిత్రకారుడు సురేష్, ప్రముఖ వాస్తు నిపుణుడు, ఈనాడు కాలమిస్ట్ కృష్ణాది శేషు, హైకోర్టు న్యాయవాది సీహెచ్ సత్యనారాయణ తదితర ప్రముఖులు పాల్గొని వేదార్త్‌ను అభినందించారు.వేదికపై అందరి సమక్షంలో వేదార్త్ ఎంతో ఉత్సాహంగా, ఏకాగ్రతతో 50 విభిన్న ఏనుగు చిత్రాలను గీయడం చూసిన అతిథులు, కళాప్రియులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.నానమ్మ, తాతయ్య ఉప్పల గౌరయ్య--నీరజ, అమ్మమ్మ, తాతయ్య ఆకుల సుదర్శన్-సులోచనల ఆశీస్సులు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్న వయసులోనే ఈ ఘనత సాధించిన వేదార్త్‌కు అన్ని వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని రికార్డులు సాధించి తెలుగు రాష్ట్రాల ఖ్యాతిని మరింత పెంచాలని పలువురు ఆకాంక్షించారు.

## పన్నూర్ శ్రీ మైసమ్మ తల్లి గుడిలో ప్రత్యేక పూజలు .

### నిర్వహించిన ఆర్ జి-3 జీఎం సుంకరి మధుసూదన్.

### సర్పంచ్ చిందం మహేష్



మంథని (ప్రశ్న న్యూస్) సింగరేణి కార్మికుల ఉన్నతాధికారులురామగిరి మండలం పన్నూర్ గ్రామంలోని ఆర్ జి-3 జీఎం కార్యాలయ పరిధిలో ఉన్న శ్రీ మైసమ్మ తల్లి గుడిలో ప్రత్యేక పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్ జి 3 జనరల్ మేనేజర్ సుంకరి మధుసూదన్ పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్ , SO-2 జీఎం రామ్మోహన్ , ఆర్ జి-3 ఎస్టేట్ ఆఫీసర్ శ్రీ ఐలయ్య , ఆర్ జి3 సివిల్ డీజీఎం రాజేంద్ర కుమార్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆర్ జి 3 జనరల్ మేనేజర్ సుంకరి మధుసూదన్ మాట్లాడుతూ, సింగరేణి ప్రైవేట్ వాహన యజమానులు, డ్రైవర్లు క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి అందిస్తున్న సహకారం అభినందనీయమని అన్నారు. ప్రతి ఒక్కరూ భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటిస్తూ సురక్షితంగా విధులు నిర్వహించాలని సూచించారు. శ్రీ మైసమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో సింగరేణి ప్రైవేట్ వాహన యజమానులు, డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. కార్యక్రమం భక్తి శ్రద్ధల మధ్య అత్యంత వైభవంగా జరిగింది.

# సారె సందడితో కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి

- ఐదో రోజే 23,916 మంది భక్తుల రాక
- మహిళలతో నిండిన దుర్గగుడి
- డిజిటల్ క్యూలతో రద్దీ నియంత్రణ
- భక్తులకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు



విజయవాడ(ప్రశ్న న్యూస్) ఆషాఢ మాస సారె ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రిపై ఆదివారం మహిళా భక్తుల రద్దీ ఉప్పొంగింది. సెలవు దినం కావడంతో రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు తెలంగాణ నుంచి భారీ సంఖ్యలో మహిళలు కనకదుర్గమ్మను దర్శించుకుని సారె సమర్పించారు. గత నాలుగు రోజుల కంటే రెండింతల రద్దీ నమోదవగా, మధ్యాహ్నం మూడు గంటలకే 57 బృందాలుగా వచ్చిన 23,916 మంది భక్తులు అమ్మవారికి సారె సమర్పించినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.తెలుగు మహిళలు కనకదుర్గమ్మను తమ ఇంటి ఇలవేల్పుగా, ఆడపడుచుగా భావించి పసుపు, కుంకుమ, గాజులు, చీరలు, కొత్త వస్త్రాలతో సారె సమర్పించడం ఆనవాయితీ. ఈ సంప్రదాయం ప్రకారం తెల్లవారుజాము నుంచే ఇంద్రకీలాద్రిపై భక్తుల రాక మొదలైంది. తెలంగాణతో పాటు ఉమ్మడి కృష్ణా, తూర్పు, పశ్చిమ గోదావరి, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు తదితర జిల్లాల నుంచి మహిళలు బృందాలుగా చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవస్థానం ఈసారి డిజిటల్ విధానాన్ని అమలు చేసింది. శ్రీ కనకదుర్గ నగర్‌లో సారె బృందాలు రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన వెంటనే ఆ వివరాలు కొండపై ఉన్న స్కానింగ్ కేంద్రానికి చేరేలా వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీంతో ఎంతమంది భక్తులు కొండపైకి వస్తున్నారన్న సమాచారం ముందుగానే అధికారులకు అందడంతో క్యూ లైన్లను పరిస్థితులకు అనుగుణంగా నిర్వహించడం సులభమైంది.సారె సమర్పించే మహిళల కోసం రూ.100 భవాని అనుగ్రహ దర్శనం క్యూ లైన్‌ను ప్రత్యేకంగా కేటాయించారు. రద్దీని బట్టి ఇతర క్యూ లైన్ల ద్వారా కూడా దర్శనానికి అనుమతించారు. దీంతో భక్తులకు దర్శనం వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు.భక్తుల రద్దీతో మహామండపంలోని ఆరో అంతస్తు పూర్తిగా నిండిపోయింది. అక్కడికి చేరుకున్న మహిళలకు వేదపండితులు, అర్చకులు ఉచితంగా ఆశీర్వచనం అందించడంతో పాటు ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం ప్రత్యేక మార్గాల ద్వారా అన్నప్రసాద కేంద్రాలకు పంపించి భోజన ఏర్పాట్లు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ట్రస్ట్ బోర్డు చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ధర్మకర్తల మండలి సభ్యులు స్వయంగా క్యూ లైన్లను పరిశీలించి భక్తులకు అందుతున్న సౌకర్యాలను సమీక్షించారు.



అవసరమైన చోట అదనపు సిబ్బందిని నియమించి రద్దీని నియంత్రించారు.ఘాట్ రోడ్డుపై పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. వాహనాలను నియంత్రిస్తూ భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు చేపట్టారు. తాగునీరు, వైద్య సదుపాయాలు, విశ్రాంతి కేంద్రాలు, వీల్‌చైర్లు, మొబైల్ మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగించారు.ఆషాఢ సారె ఉత్సవాలు భక్తి, సంప్రదాయాల సమ్మేళనంగా కొనసాగుతున్నాయి. రానున్న రోజుల్లో రద్దీ మరింత పెరిగే అవకాశం ఉండటంతో అదనపు ఏర్పాట్లు చేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. డిజిటల్ క్యూ నిర్వహణ, ప్రత్యేక దర్శన ఏర్పాట్లతో భారీ రద్దీ మధ్య కూడా భక్తులకు సజావుగా దర్శనం కల్పించగలిగామని వెల్లడించారు.

## గజ్వేల్‌లో ఘనంగా చెస్ పోటీలు

- మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం
- మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండి, ఆటలపై దృష్టి పెట్టాలి
- మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కల్యాణ్ కార్ పద్మాబాయి నర్సింగరావు



గజ్వేల్ ( ప్రశ్న న్యూస్ ) సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో చదరంగం క్రీడలు ఆదివారం అత్యంత ఘనంగా జరిగాయి. స్వామి వివేకానంద సేవాసమితి - గజ్వేల్, రాచకొండ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ - గజ్వేల్, కృష్ణవేణి టాలెంట్ స్కూల్ - గజ్వేల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కల్యాణ్ కార్ పద్మాబాయి నర్సింగరావు, 20వ వార్డు కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్, 14వ వార్డు కౌన్సిలర్ గుంటుకు లక్ష్మి శ్రీనివాస్, సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్.సి. సంతోష్ హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కల్యాణ్ కార్ పద్మాబాయి నర్సింగరావు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో పిల్లలు ఎక్కువగా మొబైల్ ఫోన్లకే పరిమితమై, వాటికి ఆకర్షితులవుతున్నారన్నారు. ఇలాంటి తరుణంలో విద్యార్థుల్లో దాగున్న ప్రతిభను వెలికితీయడానికి, వారి మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయన్నారు. ముఖ్యంగా చదరంగం లాంటి ఆటలు మేధోశక్తిని పెంచుతాయన్నారు. సమాజానికి మేలు జరిగే ఇలాంటి మంచి కార్యక్రమాన్ని చేపట్టిన నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు. అనంతరం క్రీడా పోటీల నిర్వాహకులు ముఖ్య అతిథులను శాలువాలతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. ఈ పోటీల్లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, క్రీడాభిమానులు, నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అక్రమ రేషన్ బియ్యం దందాపై

# రంగారెడ్డి జిల్లా అధికారుల వరుస దాడులు

**జర్నలిస్టుల పక్కా సమాచారంతో మెరుపు దాడులు చేస్తున్న అధికారులు**

**212 బస్తాలు, 107 క్వింటాళ్ల రేషన్ బియ్యం సీజ్**

**పేదల కడుపు కొట్టి కోట్లకు ఎగబడుతున్న అక్రమ రవాణా ముఠాలు**

**దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) పేదలకు ప్రభుత్వం అందిస్తున్న రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి భారీ లాభాల కోసం తరలిస్తున్న ముఠాలపై రంగారెడ్డి జిల్లా సివిల్ సప్లై శాఖ ఉక్కుపాదం మోపుతోంది. వరుస దాడులతో అక్రమ రవాణాదారులకు చెక్ పెడుతున్న అధికారులు తాజాగా మరో భారీ కేసును వెలుగులోకి తెచ్చారు. అమన్‌గల్ పరిధిలో



నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో 212 బస్తాల రేషన్ బియ్యం (107 క్వింటాళ్లు) స్వాధీనం చేసుకున్నారు.సివిల్ సప్లై అధికారుల సమాచారం మేరకు, ఈ దాడులకు డిప్యూటీ తహసీల్దార్ వై. రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ నరసింహారెడ్డి, అమన్‌గల్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ కేటేశ్వర్‌రావు నేతృత్వం వహించారు. పక్కా సమాచారంతో నిర్వహించిన ఈ తనిఖీల్లో భారీగా రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని అక్రమ రవాణా యత్నాన్ని భగ్నం



చేశారు. ఈ కేసులో మేడిగడ్డ తండా గ్రామానికి చెందిన నేనావత్ మణిపాల్ పై కేసు నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.ప్రభుత్వం పేదల ఆకలి తీర్చేందుకు సబ్సిడీతో పంపిణీ చేస్తున్న రేషన్ బియ్యం అక్రమ వ్యాపారుల చేతుల్లోకి వెళ్లడం ఆందోళన కలిగిస్తోంది. గ్రామాల్లో తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి, ఇతర రాష్ట్రాలకు లేదా వ్యాపార అవసరాలకు తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్న ముఠాలు పేదల హక్కులను దోచుకుంటున్నాయనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇటీవల రంగారెడ్డి జిల్లాలో వరుసగా బయటపడుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా కేసులు ఈ దందా ఎంత విస్తృతంగా సాగుతోందో స్పష్టం అవుతుంది ఇతర జిల్లాలో జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాపై సివిల్ సప్లై అధికారులు



చర్యలు తీసుకోకుండా ఉండడం వెనుక లంచాలే కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఒకవైపు అధికారులు దాడులు నిర్వహిస్తున్నప్పటికీ, మరోవైపు కొత్త మార్గాల్లో అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాలను పూర్తిగా నిర్మూలించాలంటే మరింత కఠిన చర్యలు, కేసులు అవసరమని అభిప్రాయపడుతున్నారు.

అక్రమ రేషన్ బియ్యం వ్యాపారంలో పాల్గొంటున్న ప్రధాన సూత్రధారులు, మధ్యవర్తులు, కొనుగోలుదారుల ఆర్థిక లావాదేవీలపై కూడా లోతైన విచారణ జరపాలని ప్రజలు కోరుతున్నారు. కేవలం బియ్యం స్వాధీనం చేసుకోవడమే కాకుండా, అక్రమ సంపాదనను స్వాధీనం చేసుకోవడం, వాహనాలను జప్తు చేయడం, పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

పేదల నోటికొచ్చే ముద్దను దోచుకునే వారిపై ఎలాంటి కనికరం చూపొద్దని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

ఇటువంటి నేరాలకు పాల్పడేవారికి కఠిన శిక్షలు విధించినప్పుడే అక్రమ రేషన్ బియ్యం దందాకు అడ్డుకట్ట పడుతుందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.రేషన్ బియ్యం ప్రతి గింజ పేదల హక్కు అని, దానిని దోచుకునే వారిని చట్టం ముందు నిలబెట్టి అక్రమ వ్యాపారులు భయపడే విధంగా శిక్షించాలని ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. అధికారులు ఇదే ఉత్సాహంతో నిరంతర దాడులు కొనసాగించి అక్రమ రవాణా ముఠాలను పూర్తిగా నిర్మూలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతం మాటల్లోనేనా.?

**- వికారాబాద్ మాతా,శిశు ఆరోగ్య కేంద్రంలో రోగుల కష్టాలకు అంతులేదు**

**- రోగుల రద్దీకి సరిపోని ప్రాంగణం.. బాత్రూముల కొరతతో నానా అవస్థలు**

**- గర్భిణులు, చిన్నారులకు ఇంకా వైద్యులు, సిబ్బందిని నియమించాలని ప్రజల డిమాండ్**

**- స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చొరవతో ఆసుపత్రి విస్తరణ చేపట్టాలని విజ్ఞప్తి**

వికారాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరిస్తున్నామని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితులు పూర్తిగా మారలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వికారాబాద్ జిల్లాలోని మాతా, శిశు ఆరోగ్య కేంద్రానికి రోజురోజుకూ రోగుల రద్దీ పెరుగుతుండగా, అందుకు తగిన సౌకర్యాలు లేక గర్భిణులు, చిన్నారులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.జిల్లాతో పాటు చుట్టుపక్కల మండలాల నుంచి వందలాది మంది మహిళలు, చిన్నారులు ప్రతి రోజూ ఈ ఆసుపత్రికి చికిత్స కోసం వస్తున్నారు. అయితే రోగుల సంఖ్యకు అనుగుణంగా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బంది లేకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన









పరిస్థితి నెలకొంది. అత్యవసర సేవలు, స్కానింగ్ లు పొందాల్సిన



గర్భిణులు కూడా నిరీక్షించాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది. ఆసుపత్రి భవనం ప్రస్తుతం ఉన్న అవసరాలకు ఏమాత్రం సరిపోవడం లేదని రోగులు వాపోతున్నారు. ఓపీ విభాగం నుంచి ప్రసూతి వార్డుల వరకు ప్రతిచోటా రద్దీ నెలకొనడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. వేచి ఉండేందుకు సరైన స్థలం లేక మహిళలు చిన్నారులతో కలిసి నేలపైనే కూర్చోవాల్సిన పరిస్థితులు కనిపిస్తున్నాయని స్థానికులు చెబుతున్నారు.

బాత్రూముల కొరత మరో ప్రధాన సమస్యగా మారింది. ఉన్న మరుగుదొడ్లు రోగుల సంఖ్యకు సరిపోకపోవడంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, వారి బంధువులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. పరిశుభ్రతను మరింత మెరుగుపర్చడంతో పాటు అదనపు బాత్రూములు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాలు, మందులు, ప్రత్యేక వైద్య నిపుణులు, సిబ్బంది సంఖ్యను పెంచాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు. ప్రసూతి, శిశు వైద్య విభాగాల్లో అదనపు వైద్యులను నియమిస్తే రోగులపై పడుతున్న ఒత్తిడి తగ్గడంతో పాటు మెరుగైన సేవలు అందే అవకాశం ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

స్థానిక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రత్యేక చొరవ తీసుకుని ఆసుపత్రి విస్తరణకు నిధులు మంజూరు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కొత్త భవనాలు, అదనపు వార్డులు, విశాలమైన వేచి ఉండే హాలులు, పార్కింగ్ సౌకర్యాలు, పరిశుభ్రమైన తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.ప్రైవేటు ఆసుపత్రులపై ఆధారపడకుండా సామాన్య ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలంటే ప్రభుత్వ ఆసుపత్రులను అన్ని విధాలుగా బలోపేతం చేయాల్సిందేనని ప్రజలు స్పష్టం చేస్తున్నారు. సిబ్బంది కొరతను వెంటనే భర్తీ చేయడం, అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చడం, ఆధునిక సౌకర్యాలు కల్పించడం ద్వారా మాత్రమే ప్రభుత్వ వైద్య వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెరుగుతుందని అంటున్నారు.

వైద్యం ప్రతి పౌరుడి హక్కు. అలాంటి సేవలు అందించే ప్రభుత్వ ఆసుపత్రులు సమస్యలతో సతమతమవుతుంటే ప్రజల ఆరోగ్య భద్రత ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇప్పటికైన జిల్లా కలెక్టర్, ఉన్నత అధికారులు స్పందించి వికారాబాద్ మాతా,శిశు ఆరోగ్య కేంద్రాన్ని విస్తరించి, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా ప్రజలు ముక్తకంఠంతో వేడుకుంటున్నారు.

# కృష్ణార్జునుల కలయిక..

## కమలం వికాసానికి కొత్త దిక్సూచి

**బండి సంజయ్ -- ఈటెల రాజేందర్ ఐక్యతతో**

**తెలంగాణ బీజేపీలో నూతన ఉత్సాహం..**

**అధికారమే లక్ష్యమంటూ కలిసికట్టుగా ముందుకు**




కీసర( ప్రశ్న న్యూస్) తెలంగాణ బీజేపీలో కొంతకాలంగా చర్చనీయాంశమైన బండి సంజయ్ కుమార్, ఈటెల రాజేందర్ మధ్య విభేదాలకు ముగింపు పలుకుతూ ఇద్దరు నాయకులు ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకోవడం పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. వ్యక్తిగత విభేదాలను పక్కనబెట్టి, పార్టీ ప్రయోజనాలే ప్రధానమనే సందేశాన్ని ఇద్దరూ ఇచ్చారు.

మహాభారతంలో శ్రీకృష్ణుడు--అర్జునుడి అనుబంధం ధర్మ విజయం కోసం నిలిచినట్లే, తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ ఇద్దరు నేతలు కలిసికట్టుగా అడుగులు వేయడం పార్టీకి కీలక మలుపుగా భావిస్తున్నారు. ఒకరి రాజకీయ అనుభవం, మరొకరి ప్రజా ఉద్యమాల పోరాట పటిమ కలిస్తే తెలంగాణ రాజకీయాల్లో బీజేపీకి కొత్త శక్తి చేకూరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది."వ్యక్తిగత ప్రయోజనాలు కాదు, పార్టీ ప్రయోజనాలే ముఖ్యం" అనే సందేశంతో బండి సంజయ్, ఈటెల రాజేందర్ కలిసి ముందుకు సాగాలని నిర్ణయించుకోవడం కాషాయ శ్రేణుల్లో నూతన ఆశలను రేకెత్తిస్తోంది.

# భారత్ కచ్చితంగా ఫిఫా వరల్డ్ కప్‌లో ఆడుతుంది


**- ఆ జట్టులో తెలంగాణ స్టార్లు ఉంటారన్న సీఎం రేవంత్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారత ఫుట్‌బాల్ భవిష్యత్తుపై తనకున్న దార్శనికతను పంచుకున్నారు. భవిష్యత్తులో టీమిండియా ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్స్‌లో ఆడటమే కాకుండా, ఆ టోర్నీకి ఆతిథ్యం కూడా ఇస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం అర్జెంటీనా, స్పెయిన్ మధ్య ఫిఫా వరల్డ్ కప్ ఫైనల్ జరగనున్న నేపథ్యంలో ఆయన సోషల్ మీడియా వేదికగా ఈ వ్యాఖ్యలు చేశారు. తాను ఫుట్‌బాల్‌ను ఎంతగానో ఇష్టపడతానని పేర్కొన్న ఆయన, భవిష్యత్తులో వరల్డ్ కప్ ఆడే భారత జట్టులో తెలంగాణ నుంచి పలువురు స్టార్లు ఉంటారని జోస్యం చెప్పారు. "ఈ మాట గుర్తుపెట్టుకోండి.. భవిష్యత్ సాకర్ స్టార్లు చాలామంది తెలంగాణ నుంచే వస్తారు" అని ఆయన అన్నారు. ఫిఫా వరల్డ్ కప్‌కు తన మద్దతు వెనుక లోతైన ఉద్దేశం, దార్శనికత ఉన్నాయని వివరించారు. గతంలో ఫుట్‌బాల్ దిగ్గజం లియోనెల్ మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొచ్చి, తెలంగాణ పిల్లలతో కలిసి మైదానంలో పాలుపంచుకునేలా చేసిన రోజును తాను ఎంతో ఇష్టపడతానని ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. చివరగా, ఫుట్‌బాల్ అభిమానులందరూ ఫైనల్ మ్యాచ్‌ను ఆస్వాదించాలని ఆయన ఆకాంక్షించారు.

# ఢిల్లీలో అఖిలపక్ష భేటీలో రగడ

**- విపక్షాల వాకౌట్**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు కొన్ని గంటల ముందు కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో గందరగోళం చెలరేగింది. తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) రెబల్ ఎంపీలకు ఆహ్వానం పలకడాన్ని నిరసిస్తూ విపక్ష పార్టీల నేతలు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అయితే, ఇది కేవలం సాంకేతిక నిరసన మాత్రమేనని తెలిపి, కొద్ది నిమిషాలకే తిరిగి సమావేశంలో పాల్గొన్నారు. నేటి నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ సమావేశాల అజెండాను చర్చించేందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశం మొదలైన వెంటనే కాంగ్రెస్, టీఎంసీ, సమాజ్‌వాదీ పార్టీ, డీఎంకే, ఆప్, శివసేన (యూబీటీ) సహా పలు విపక్ష పార్టీల నేతలు నిరసనగా బయటకు వెళ్లిపోయారు.టీఎంసీ నుంచి తిరుగుబాటు చేసిన సుమారు 20 మంది ఎంపీలు నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరారు. అయితే, ఈ విలీనానికి లోక్‌సభ స్పీకర్ నుంచి అధికారికంగా ఎలాంటి ఆమోదం లభించలేదని, పార్లమెంట్ రికార్డుల్లో వారు ఇంకా టీఎంసీ ఎంపీలుగానే ఉన్నారని విపక్షాలు వాదించాయి. పార్లమెంట్ వెబ్‌సైట్‌లో ఎన్‌సీపీఐ అనే పార్టీయే లేనప్పుడు వారిని ఎలా ఆహ్వానిస్తారని టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్ ప్రశ్నించారు. ఇది నిబంధనలను ఉల్లంఘించడమేనని విపక్షాలు ఆరోపించాయి.ఈ పరిణామంపై కేంద్రమంత్రి కిరణ్ రిజిజు స్పందిస్తూ స్పీకర్ వద్ద గుర్తింపు కోసం దరఖాస్తు చేసుకున్న పార్టీలను ఆహ్వానించడం తమ బాధ్యత అని తెలిపారు. మరోవైపు, తమకు ఆహ్వానం అందడాన్ని ఎన్‌సీపీఐ నేత కకోలి ఘోష్ దస్తిదార్ స్వాగతించారు. ఈ ఘటనతో వర్షాకాల సమావేశాలు వాడివేడిగా సాగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ సమావేశాల్లో నీట్ పరీక్షల లీకేజీలు, వ్యవసాయ సమస్యలు, రామాలయ విరాళాల అంశాలను లేవనెత్తాలని విపక్షాలు సిద్ధమవుతున్నాయి.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588